


# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక




హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 135, ఎడిటర్,భీముడు నాయక్ పేజీలు : 12, వెల రూ. 1, గురువారం - 20- జూన్ - 2024

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## ఇకపై ఆదాయ పన్ను పరిమితి రూ. 5 లక్షలు

### బడ్జెట్ లో ప్రతిపాదించే అవకాశం

ఢిల్లీ: వ్యక్తిగత ఆదాయపు పన్ను రేట్లను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలుస్తోంది. ఈ బడ్జెట్ లో అందుకు సంబంధించిన నిర్ణయాలు వెలువడవచ్చని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు. ఆదాయ పన్ను పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని కేంద్రం యోచిస్తోంది. జూలై నెలలో ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్ లో ఈ దిశగా నిర్ణయాలు ఉండవచ్చు. అయితే, ఈ మార్పు కొత్త పన్ను విధానం కింద రిటర్నులు దాఖలు చేసే వారికి మాత్రమే వర్తిస్తుంది.



## ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

ఢిల్లీ :ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని కోర్టు జులై 3వ తేదీ వరకు పొడిగించింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన ప్రచారం కోసం మధ్యంతర బెయిల్ పైన కొన్నిరోజులు బయట ఉన్నారు. తిరిగి ఈ నెల 2వ తేదీన కోర్టు ఎదుట లొంగిపోయారు. నాటి నుంచి ఆయన జైల్లోనే ఉన్నారు. తాజాగా కేజ్రీవాల్ కస్టడీని రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్ కళ్యాణ్



- పవన్ కళ్యాణ్ తొలి సంతకం దేనిపై అంటే..!
- ఉపాధి హామీ పథకాన్ని ఉద్యాన వన సంబంధిత పనులకు అనుసంధానించి

# ఎప్పుడైనా కూలిపోవచ్చు:..!!

- ఎన్డీఏ నేతలు మాకు టచ్‌లో ఉన్నారు..
- మోదీ సర్కార్ ఎప్పుడైనా కూలిపోవచ్చు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



ఢిల్లీ: కేంద్రంలో బీజేపీ నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీఏ కూటమి సంకీర్ణ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దేశంలో సంచలనం సృష్టిస్తున్నాయి. ఎన్డీఏ కూటమిలోని నేతలు కొందరు కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉన్నారని.. రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్డీఏ కూటమిలోనే కొందరు నేతలు తమకు టచ్‌లో ఉన్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో వారంతా అసంతృప్తిగా ఉన్నారని.. ఈ క్రమంలోనే కేంద్రంలోని సంకీర్ణ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోయే అవకాశాలు ఉన్నాయని రాహుల్ గాంధీ పేర్కొనడం ప్రస్తుతం సంచలనంగా మారింది. అయితే ఆ నేతలు ఎవరు అనేది మాత్రం రాహుల్ గాంధీ వెల్లడించలేదు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాన్ని ఉద్దేశించి రాహుల్ గాంధీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తాజాగా ఓ నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. నరేంద్ర మోదీ సర్కార్‌పై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలో కూటమిలో తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు.కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి నేతలు కొందరు తమకు టచ్‌లోనే ఉన్నారని చెప్పిన రాహుల్ గాంధీ.. అయితే వాటికి సంబంధించి మరిన్ని వివరాలు మాత్రం చెప్పలేదు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి భవిష్యత్ మిగతా..2లో

## లోక్‌సభ స్పీకర్‌గా దగ్గుబాటి పురందేశ్వరి..!



న్యూఢిల్లీ : ప్రస్తుతం దేశం మొత్తం 18 వ లోక్‌సభ స్పీకర్ ఎవరా అని తీవ్ర ఆసక్తితో ఎదురుచూస్తోంది. గతంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ.. సొంతంగా మెజార్టీ సాధించడంతో ఏకగ్రీవంగా స్పీకర్ ఎన్నిక జరిగింది. కానీ ఈసారి బీజేపీకి సొంతంగా మెజార్టీ రాకపోవడంతో ఎన్డీఏ కూటమిలోని ఇతర పార్టీల అంగీకారం, మద్దతు అవసరం అయ్యాయి. ఈ క్రమంలోనే ప్రముఖంగా లోక్‌సభ స్పీకర్ రేసులో రెండు పేర్లు వినిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నుంచి బీజేపీ తరఫున ఎంపీగా గెలిచిన దగ్గుబాటి పురందేశ్వరికి ఆ పదవి దక్కే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ప్రధానమంత్రి, కేంద్రమంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రులకు శాఖల కేటాయింపు కూడా పూర్తయింది. ఈ క్రమంలోనే కేంద్రమంత్రులు ఒక్కొక్కరుగా బాధ్యతలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే మరో కీలకమైన లోక్‌సభ స్పీకర్ ఎవరు అనే చర్చ మాత్రం ఇంకా కొలిక్కి రాలేదు. లోక్‌సభ స్పీకర్ కుర్చీలో ఎవర్ని కూర్చోబెట్టాలా అని మిగతా..2లో

## రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి.. ఈ ఘటనలే నిదర్శనమన్న హరీశ్‌రావు



హైదరాబాద్ : రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయ నేటందుకు వరుసగా జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, హింసాయుత ఘటనలే నిదర్శనం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు.

## ఈవీఎంలపై జగన్ పాత వీడియోతో లోకేశ్ కౌంటర్



మంగళగిరి,కోస్తా లీడర్ ప్రతినిధి : ఏపీ మాజీ సీఎం జగన్ నుంచి ఎలాన్ మస్క్ వరకు ఇప్పుడు ఈవీఎం హ్యాకింగ్ గురించి మాట్లాడుతున్నారు. ఏపీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీ... ఫలితాలు విడుదలైన రోజు నుంచి ఈవీఎంల హ్యాకింగ్ పై ఆరోపణలు చేస్తుంది. ఆ పార్టీ అధినేత జగన్ అయితే ట్విట్టర్ వేదికగా వరుసగా పోస్టులు చేస్తున్నారు. ఈవీఎంలపై జగన్ ఆరోపణకు టీడీపీ గట్టి కౌంటర్లు ఇస్తుంది. గతంలో జగన్ మాట్లాడిన వీడియోలనే వైరల్ చేస్తుంది. ప్రజల తీర్పు తనకు అనుకూలంగా వస్తే ఒకలా ఈవీఎంలు ఓకే, వ్యతిరేకంగా వస్తే ఈవీఎం వద్దు బ్యాలెట్లు కావాలని జగన్ అంటున్నారని టీడీపీ ఎద్దేవా చేస్తుంది."న్యాయం జరగడం మాత్రమే కాదు, న్యాయం జరిగిన విధానం కూడా కనిపించాలి. అలాగే ప్రజాస్వామ్యం గెలవడంతో పాటు నిస్సందేహంగా గెలిచినట్లు కనిపించాలి. దాదాపు అభివృద్ధి చెందిన ప్రతి ప్రజాస్వామ్యంలో, ప్రపంచవ్యాప్తంగా మిగతా..2లో

# ఏదో చేసేటట్టే ఉన్నాడే!

- చంద్రబాబు సంచలన నిర్ణయం
- అనుబంధ విభాగాలను మరింత బలోపేతం
- యువ రక్తానికి మరో ముందడుగు
- పనిచేసిన వారిని సాగనంపడం
- మరో మూడు వారాల్లో పార్టీ ప్రక్షాళన దిశ


వివరాలు 2లో..

విజయవాడ : మరోవైపు ఇటీవల ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని సాగనంపడానికి కూడా చంద్రబాబు డిసైడ్ అయినట్లు సమాచారం. ఏయే నియోజకవర్గాల్లో పార్టీకి ఏయే నేత వ్యతిరేకంగా పనిచేశారు వివరాలు తీసుకున్నారు. తెలుగుదేశం పార్టీలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టనున్నారు చంద్రబాబు.ఉభయ రాష్ట్రాల అధ్యక్షుల నుంచి.. గ్రామస్థాయి కార్యవర్గం వరకు కొత్తవారిని నియమించనున్నారు. ఇప్పటికే ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావును నియమించారు. తెలంగాణకు సైతం అధ్యక్షుడి నియామకం కోసం కసరత్తు చేస్తున్నారు. వీలైనంత త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి చంద్రబాబు పావులు కదుపుతున్నారు. ఏపీలో అధికారంలోకి రావడంతో ఉభయ

## రాజీనామా వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోం

- మంత్రి బాల వీరాంజనేయ స్వామి



విజయవాడ : గత వైసీపీ ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు వాలంటీర్ వ్యవస్థను వినియోగించింది. అయితే ఎన్నికల ప్రక్రియలో వాలంటీర్లకు బాధ్యతలు అప్పగించవద్దని ఈసీ చెప్పడంతో... చాలా మంది

# చంద్రబాబు ప్రభుత్వం పర్యాటకానికే రుషికొండ భవనాలు..!

### ఆదాయ మార్గాలపై ఫోకస్




అమరావతి : ప్రజా ధనంతో నిర్మించిన విశాఖపట్నం రుషికొండపై నిర్మించిన భవనాలను ఆదాయ మార్గాలుగా వినియోగించుకోవడానికే కొత్త ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. వైసీపీ ప్రభుత్వం రుషికొండపై దాదాపు రూ.470కోట్ల రుపాయల వ్యయంతో భవనాలను నిర్మించింది. పర్యాటక భవనాలుగా చెబుతూ ముఖ్యమంత్రి నివాసం కోసం వీటిని నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయి. విశాఖపట్నంలో సముద్ర తీరానికి అభిముఖంగా భీమిలీ మార్గంలో రుషికొండపై గతంలో పర్యాటక భవనాలు ఉండేవి. వాటి స్థానంలో గత ప్రభుత్వం కొత్త భవనాలను నిర్మించింది. వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్ నివాసం కోసమే రుషికొండ భవనాలను ఎంపిక చేశారనే విమర్శలు వచ్చినా ప్రభుత్వం వాటిని తోసిపుచ్చింది. ఎన్నికలకు కొద్ది నెలల ముందు పర్యాటక శాఖ మంత్రి రోజా ఈ భవనాలను అధికారికంగా ప్రారంభించారు.మరోవైపు ఏపీ పరిపాలన మిగతా..2లో

## ఏపీ అసెంబ్లీ సమావేశాల తేదీలు ఖరారు..




అమరావతి : ఏపీలో అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు తేదీలు ఖరారయ్యాయి. ఈ నెల 21 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. రెండురోజులపాటు ఈ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సెషన్ లో ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారంతోపాటుగా స్పీకర్ ఎన్నిక ఉంటుంది. అయితే, వాస్తవానికి ఈ నెల 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావించినట్లు ప్రచారం జరిగింది.తాజాగా తేదీల్లో మార్పులు చోటు చేసుకున్నాయి.అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యే తొలిరోజునే..అంటే ఈ నెల 21న ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం ఉండనున్నది.ఆ మరుసటి మిగతా..2లో

## హజ్ యాత్రలో మృత్యుఘోష.. ఈసారి 550 మందికి పైగా మృతి!



- పవిత్ర హజ్ యాత్రలో ఎండ తీవ్రరూపం
- ఎండలు, ఉక్కపోతతో యాత్రికుల తీవ్ర ఇబ్బందులు
- ఎండ వేడిమికి తాళలేక ఇప్పటివరకు 550 మందికి పైగా మృతి
- చనిపోయిన వారిలో ఈజిప్ట్, జోర్డాన్ దేశస్తులు అధికం
- సుమారు 323 మంది ఈజిప్షియన్ల మృత్యువాత

## ఇకపై ఆదాయ పన్ను పరిమితి రూ. 5 లక్షలు

మొదటి పేజి తరువాయి

రూ. 5 లక్షలకు ఆదాయ పన్ను పరిమితిని పెంచడం ద్వారా తక్కువ సంపాదన శ్రేణిలో ఉన్నవారికి మరింత డిస్పోజబుల్ ఆదాయాన్ని అందించగలమని ప్రభుత్వం భావిస్తోంది. పాత పన్ను విధానానికి ప్రత్యామ్నాయంగా కొత్త పన్ను విధానాన్ని 2020 బడ్జెట్ లో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టారు. అయితే, పాత పన్ను విధానాన్ని కొనసాగించాలని కోరుకునేవారు పాత పన్ను విధానంలోనే కొనసాగించే అవకాశం ఇచ్చారు. పాత పన్ను విధానంలో పన్ను చెల్లింపుదారులు కొన్ని సెక్షన్ల కింద పెట్టుబడులకు మినహాయింపులు, ఇంటి అద్దె అలవెన్స్, లీవ్ ట్రావెల్ అలవెన్స్ వంటి మినహాయింపులను క్లెయిమ్ చేసుకోవచ్చు. కొత్త పన్ను విధానంలో అత్యధిక వ్యక్తిగత ఆదాయపు పన్ను రేటును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించాలని పరిశ్రమ ప్రతినిధులు చేసిన అభ్యర్థనను కేంద్రం పరిగణనలోకి తీసుకునే అవకాశం లేదని అధికారులు తెలిపారు. అధిక ఆదాయ పన్ను శ్లాబుల్లో మార్పులు చేసే అవకాశం లేదని, ఎందుకంటే ప్రస్తుతం తక్కువ ఆదాయం ఉన్నవారికి వినియోగ ప్రోత్సాహం అవసరమని ఒక అధికారి తెలిపారు. 30 శాతం గరిష్ట ఆదాయ పన్ను రేటు పరిమితిని రూ .10 లక్షల నుండి రూ .20 లక్షలకు పెంచాలని అభ్యర్థనలు ఉన్నప్పటికీ ప్రభుత్వం పాత పన్ను విధానం కింద రేట్లను సర్దుబాటు చేసే అవకాశం లేదు. మినహాయింపులు, రిబేట్లను నిరుత్సాహపరిచే కొత్త విధానాన్ని మరింత మంది అవలంబించేలా ప్రోత్సహించడమే ఈ నిర్ణయం లక్ష్యమని అధికారులు తెలిపారు. కొత్త పన్ను విధానంలో, వార్షికంగా రూ. 15 లక్షలకు పైగా సంపాదించే వారు 30 శాతం పన్ను పరిధిలోకి వస్తారు. అయితే, పాత విధానంలో, ఈ బ్రాకెట్ రూ. 10 లక్షల ఆదాయంతో ప్రారంభమవుతుంది.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్

అమరావతి: విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం హోదాలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రిగా పవన్ కల్యాణ్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రెండు ఫైళ్లపై మంత్రి హోదాలో ఆయన సంతకాలు చేశారు. ఉపాధి హామీ పథకాన్ని ఉద్యాన వన సంబంధిత పనులకు అనుసంధానించి నిధుల మంజూరుపై తొలి సంతకం చేశారు. ఆ తర్వాత గిరిజన గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణంపై రెండో సంతకం చేశారు. ఇక 2019లో ఆయన ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. జాతీయ 'ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తాం. ఈ అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టబోతున్నాం. మహిళా దినోత్సవం రోజును పురష్కరించుకుని రైతులకు జనసేన ఇస్తున్న మాట ఇది. రైతు ఆడపడుచుల విన్నపాలు అందిన తరువాత వచ్చిన ఆలోచనే ఇది' అని 2019లో మహిళా దినోత్సవ వేడుకల్లో జనసేనాని మాట ఇచ్చారు. ఇప్పుడు ఆ మాటను పవన్ కల్యాణ్ నిలబెట్టుకున్నారు.

## రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి.. ఈ ఘటనలే నిదర్శనమన్న హరీశ్‌రావు

మొదటి పేజి తరువాయి

గడిచిన వారం రోజుల్లో నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలంలో అందరూ చూస్తుండగా సంజీవ్ అనే వ్యక్తిని కర్రలతో కొట్టి చంపారు. హైదరాబాద్ నడిబొడ్డున బాలాపూర్‌లో అందరూ చూస్తుండగా సమీర్ అనే యువకుడిని దారుణంగా పొడిచి చంపారు. పెద్దపల్లి జిల్లాలో ఆరేళ్ల చిన్నారిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటన మరచిపోక ముందే, మరో దారుణం చోటుచేసుకున్నది. రక్షించాల్సిన పోలీసే, తోటి మహిళా కానిస్టేబుల్‌ను భక్షించే దుర్ఘటన నిన్న భూపాలపల్లి జిల్లాలో జరగడం అత్యంత హేయమైన చర్య. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రభుత్వం తక్షణం స్పందించి కారకుడైన ఎస్ఐపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. గత పదేళ్ళలో శాంతి భద్రతలకు చిరునామాగా మారిన తెలంగాణ రాష్ట్రంలో, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో భద్రత ప్రశ్నార్థకమవటం బాధాకరం. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ఇకమీదట ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలు కాపాడాలని కోరుతున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## రాజీనామా వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోం

మొదటి పేజి తరువాయి

వాలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా చేసిన వాలంటీర్లు ప్రత్యక్షంగా వైసీపీకి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అయితే వాలంటీర్లు రాజీనామాలు చేయొద్దని, వైసీపీ ప్రచారం చేయొద్దని అప్పట్లో కూటమి పార్టీలు కోరారు. తమ ప్రభుత్వం వస్తే వాలంటీర్లకు రూ.10 వేల గౌరవ వేతనం అందిస్తామని హామీ ఇచ్చాయి. వైసీపీ నేతల ఒత్తిడితో రాజీనామాలు చేశామని, తమను మళ్లీ వాలంటీర్లుగా తీసుకోవాలని కొందరు కోరుతున్నారు. తమతో బలవంతంగా రాజీనామా చేయించారని ఫిర్యాదులు చేస్తున్నారు.వాలంటీర్ వ్యవస్థ కొనసాగింపుపై మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియాతో మాట్లాడిన మంత్రి డోలా... వైఎస్ జగన్ వైఫల్యాలు, అరాచకాలపై ప్రజలు తిరగబడ్డారన్నారు. జులై 1వ తేదీనే లబ్ధిదారులకు ఇంటి దగ్గరే పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. రూ.4వేల పింఛన్‌తో పాటు మూడు వేలు కలిపి రూ.7 వేలు అందిస్తామన్నారు. రాజీనామాలు చేయకుండా ఉద్యోగంలో ఉన్న వాలంటీర్లతో పని చేయించుకుంటామన్నారు. వైసీపీ నేతలు బలవంతంగా రాజీనామాలు చేయించారని వాలంటీర్ల నుంచి మెయిల్స్, ఫోన్ కాల్స్ వస్తున్నాయన్నారు. ఉద్యోగాలకు రాజీనామా చేసిన వాలంటీర్లను తిరిగి తీసుకోమని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు.వైసీపీ నేతలు తమతో బలవంతంగా రాజీనామాలు చేయించారని వాలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. రాజీనామాలు చేసిన వారి నుంచి పెద్దఎత్తున వినతులు వస్తున్నాయన్నారు. అయితే రాజీనామా చేయకుండా ఉన్న వాలంటీర్లను మాత్రమే కొనసాగిస్తామని పేర్కొన్నారు. చంద్రబాబు మంత్రి వర్గంలో చోటు దక్కడం ఒక వరంగా భావిస్తున్నానన్నారు. మాది విడతల వారి ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమన్నారు. ప్రకాశం జిల్లాలో కీలకమైన వెలుగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేస్తామన్నారు. మూతపడిన పాఠశాలలు తిరిగి తెరిపిస్తామని మంత్రి బాల వీరాంజనేయ స్వామి తెలిపారు.నెల్లూరు జిల్లాలో వైసీపీ నేతలపై వాలంటీర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు జిల్లా చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో వాలంటీర్లు స్థానిక కార్పొరేటర్, వైసీపీ నేతలపై ఫిర్యాదు చేశారు. ఎన్నికలకు ముందు తమతో బలవంతంగా రాజీనామా చేయించారని వాలంటీర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మీటింగ్ అని పిలిచి రాజీనామా చేయించారని ఆరోపించారు. రాజీనామాలు చేయనివారిపై ఒత్తిడి చేశారన్నారు. నియోజకవర్గాల్లో వాలంటీర్లు స్థానిక ఎమ్మెల్యేలను కలిసి తమ ఉద్యోగాలు తిరిగి ఇవ్వాలని కోరుతున్నారు. ఎన్నికల సమయంలో లక్షకు పైగా వాలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. వైసీపీ ప్రభుత్వంలో 1.25 లక్షల మంది వాలంటీర్లను నియమించారు. వీరిలో దాదాపుగా 1.08 లక్షల మంది రాజీనామాలు చేశారు. ఇప్పుడు వీరంతా స్థానిక కూటమి నేతలకు వినతులు అందిస్తున్నారు.

## ఏపీ అసెంబ్లీ సమావేశాల తేదీలు ఖరారు..

మొదటి పేజి తరువాయి

రోజున 22న స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ఉండనున్నట్లు తెలుస్తోంది.కాగా,ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ గా చింతకాయల అయ్యన్నపాత్రుడికి అవకాశం ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పదవులు జనసేనకు ఇవ్వనున్నారని తెలుస్తోంది. దీనిపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. ప్రొటెం స్పీకర్ గా మరో సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి వ్యవహరించనున్నట్లు సమాచారం. అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేల హాజరుపై ఉత్కంఠ నెలకొన్నది. ఈ నెల 22న వైసీపీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో జగన్ హాజరుకానున్నారని వైసీపీ నేతలు చెబుతున్నారుఇదిలా ఉంటే.. ప్రస్తుతం అసెంబ్లీలో వైసీపీకి ప్రతిపక్ష హోదా దక్కే అవకాశం లేదు. ఎందుకంటే ఆ హోదా దక్కాలంటే.. మొత్తం సీట్లలో 10 శాతం సీట్లు గెలవాల్సి ఉంటుంది. కనీసం 18 సీట్లలోనైనా గెలిచి ఉండాలి. కానీ.. వైసీపీ మాత్రం కేవలం 11 సీట్లలో విజయం సాధించింది. అందువల్ల ఇప్పుడు అధికారంలో భాగంగా ఉన్నటువంటి జనసేన పార్టీనే ప్రతిపక్ష హోదా కూడా పొందినట్లు అయ్యింది. తక్కువ సంఖ్యలో వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నందున అసెంబ్లీ సమావేశాల సమయంలో మాట్లాడేందుకు ఎక్కువ టైం లభించకపోవొచ్చు అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## లోక్‌సభ స్పీకర్‌గా దగ్గుబాటి పురందేశ్వరి..!

మొదటి పేజి తరువాయి

బీజేపీ హై కమాండ్ తర్జన భర్జన పడుతోంది. ఈ క్రమంలోనే స్పీకర్ పదవి రేసులో ప్రముఖంగా ఇద్దరి పేర్లు వినిపిస్తున్నాయి. ఏపీలోని రాజమండ్రి నుంచి గెలిచిన ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి.. ఒడిశాలోని కటక్ నుంచి ఎంపీగా గెలిచిన భర్తృహరి మహతాబ్‌ల వైపే బీజేపీ అధిష్ఠానం మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.రాజ్యాంగ నిబంధనల ప్రకారం.. కొత్త లోక్‌సభ మొదటిసారి సమావేశానికి ముందు స్పీకర్ పదవి ఖాళీ అవుతుంది. ఈ క్రమంలోనే కొత్త ఎంపీలతో ప్రమాణ స్వీకారం చేయించేందుకు సభలో సీనియర్ సభ్యుడిని ప్రొటెం స్పీకర్‌గా రాష్ట్రపతి నియమిస్తారు. ఆ ప్రొటెం స్పీకర్ ఎంపీలతో ప్రమాణం చేయిస్తారు. అయితే ప్రొటెం స్పీకర్ రేసులో కాంగ్రెస్ సీనియర్ నేత కొడికున్నిల్ సురేశ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మరోవైపు.. స్పీకర్ ఎంపికపై బీజేపీ తీవ్ర కసరత్తు చేస్తోంది. స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ప్రొటెం స్పీకర్‌గా ఎవరిని నియమించాలి అనేదానిపై చర్చించేందుకు ఇవాళ సాయంత్రం బీజేపీతోపాటు ఎన్డీఏ కూటమిలోని కేంద్రమంత్రులు.. కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాసంలో భేటీ కానున్నారు. ఈ సమావేశం తర్వాత స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ప్రొటెం స్పీకర్ ఎవరూ అనేదానిపై స్పష్టత రానుంది.అయితే ఈసారి సొంతంగా బీజేపీకి లోక్‌సభలో మెజార్టీ మార్కుకు అవసరమైన సీట్లు రాకపోవడంతో ఎన్డీఏ కూటమిలోని ఇతర పార్టీల మద్దతు అవసరం అయింది. ఈ క్రమంలోనే మిత్ర పక్షాలు.. లోక్‌సభ స్పీకర్ పదవిని ఆశిస్తున్నాయి. అయితే బీజేపీ మాత్రం.. ఆ లోక్‌సభ స్పీకర్ పదవిని వదులుకునేందుకు ఎట్టి పరిస్థితుల్లో సిద్ధంగా లేదు. ఇక త్వరలోనే లోక్‌సభ సమావేశాలు జరగనుండటంతో స్పీకర్ ఎవరూ అనే సస్పెన్స్ కొనసాగుతోంది. మరోవైపు.. దేశ చరిత్రలో ఇప్పటివరకు లోక్‌సభ స్పీకర్ ఎన్నిక జరగలేదు. ప్రతీసారి ఎవరినో ఒకరిని ఏకగ్రీవంగా ఎన్నుకుని వారినే స్పీకర్ కుర్చీలో కూర్చోబెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఈసారి ఎవరికి ఆ పదవి దక్కనుంది అనే ఉత్కంఠ అందరిలో కొనసాగుతోంది.2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్ని దక్కించుకోవడంతో బీజేపీ కేంద్రంలో సొంతంగానే అధికారాన్ని చేపట్టింది. దీంతో ఎవరి అవసరం లేకుండానే ఆ పార్టీ ఎంపీలే స్పీకర్‌లుగా నియమించబడ్డారు. 2014 లో 16వ లోక్‌సభ స్పీకర్‌గా బీజేపీ ఎంపీ సుమిత్రా మహాజన్.. 2019 లో 17వ లోక్‌సభ స్పీకర్‌గా ఓంబిర్లాను ప్రధానమంత్రిగా నియమించారు.

# ఎప్పుడైనా కూలిపోవచ్చు..!!

మొదటి పేజి తరువాయి

నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి భవిష్యత్ మనుగడ కోసం తీవ్రంగా ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నట్లు రాహుల్ గాంధీ అంచనా వేశారు. ఎన్డీఏ కూటమి బలహీనంగా ఉండటంతో ఏ చిన్న సమస్య తలెత్తినా అది నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని కూల్చేయవచ్చని సంచలనం సృష్టించే వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల సమయంలోనే నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాలను ఉద్దేశించి రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ, నరేంద్ర మోదీ విద్వేషాన్ని వ్యాప్తి చేసి.. వాటి ద్వారా ఎన్నికల్లో గెలిచి అధికారాన్ని పొంది ఉండవచ్చని.. అయితే ఈసారి ఆ ఆలోచనను ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. ఎలాంటి వివక్ష లేని పరిస్థితులు ఉంటే.. విపక్ష ఇండియా కూటమి ఎలాంటి సందేహం లేకుండా ఈ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను దక్కించుకుని ఉండేదని రాహుల్ గాంధీ చెప్పారు. తమ చేతులు కట్టేసిన పరిస్థితుల్లో కూడా ఇండియా కూటమి పోరాటం చేసిందని.. అలాంటి సమయాల్లో ప్రజలకు ఏం చేయాలో కచ్చితంగా తెలుసని అన్నారు.గత 2014,



2019 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ సొంతంగా మెజార్టీ సాధించింది. కానీ ఈసారి మాత్రం 240 సీట్లు మాత్రమే సాధించి.. మెజార్టీ మార్కుకు దూరంగా ఆగిపోయింది. దాంతో ఎన్డీఏ కూటమిలోని ఇతర పార్టీలపై ఆధారపడక తప్పలేదు. మరోవైపు కాంగ్రెస్ గతంతో పోలిస్తే మెరుగైన ప్రదర్శన చేసి ఈసారి 99 సీట్లలో విజయం సాధించింది. ఇండియా కూటమి పార్టీలకు 230కి పైగా సీట్లు వచ్చాయి. ఈ క్రమంలోనే మోదీ ప్రభుత్వం కూలిపోతుందని రాహుల్ గాంధీ లాంటి వ్యక్తి వ్యాఖ్యలు చేయడం ప్రస్తుతం ప్రాధాన్యం సంతరించుకుంది.

# చంద్రబాబు ప్రభుత్వం పర్యాటకానికే రుషికొండ భవనాలు..!

మొదటి పేజి తరువాయి

రాజధానిని విశాఖపట్నం తరలించేందుకు గత నాలుగున్నరేళ్లుగా సీఎం జగన్మోహన్ రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేశారు. దీనిపై రకరకాల వివాదాలు తలెత్తాయి. కోర్టు కేసులు, రాజకీయ విమర్శలు చెలరేగినా వెనక్కి తగ్గలేదు. అదే సమయంలో విశాఖపట్నంలో ముఖ్యమంత్రి నివసించడానికి వీలుగా నిర్మాణాలను కూడా చేపట్టారు. ఎన్నికల్లో గెలిచి విశాఖలో ప్రమాణ స్వీకారం చేసి, రుషికొండ భవనాల్లో బస చేయాలని భావించారు. ఇందుకు తగ్గట్టుగా ఆ భవనాలను తీర్చిదిద్దారు. ఎన్నికల్లో అనూహ్యంగా జగన్ ఓటమి పాలవడంతో రుషికొండ ప్యాలెస్ వైభోగాలు వెలుగు చూశాయి.ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరాన్ని అమరావతిలోనే కొనసాగించాలని టీడీపీ నిర్ణయించడంతో రుషికొండ భవనాలను ఏమి చేస్తారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోఈ భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయాలనే సూచనలు కూడా వచ్చాయి. అయితే విశాఖపట్నం వంటి కాస్మోపాలిటిన్ నగరంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వాటిని నిర్వహించనుంది.దేశంలో ప్రస్తుతం డెస్టినేషన్ వెడ్డింగ్‌లను నిర్వహిస్తోన్న ప్యాలెస్‌లకు ఏ మాత్రం తీసిపోని విధంగా రుషికొండ భవనాలు ఉన్నాయి. హైదరాబాద్‌లో ఉన్న నిజాం కాలం నాటి నిర్మాణాలు, రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఉన్న పర్యాటక కేంద్రాల తరహాలో డెస్టినేషన్ వేడుకలకు అనువైన పర్యాటక కేంద్రంగా రుషికొండను నిర్వహించాలనే ప్రతిపాదనల్ని కూడా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భవనాల్లో కొద్ది పాటి మార్పులు చేస్తే మరికొన్ని గదులు




అందుబాటులోకి వచ్చే అవకాశాలను డిజైనర్లు పరిశీలిస్తున్నారు.రుషికొండలో ఉన్న మొత్తం భవనాల్లో ఒకటి రెండు భవనాలను భవిష్యత్తులో ప్రభుత్వ అవసరాల కోసం వినియోగించుకోవాలనే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. జగన్మోహన్ రెడ్డి ముచ్చటపడి నిర్మించుకున్న రుషికొండ సౌధాలను ఎందుకు పనికి రాకుండా చేసే ఆలోచన ప్రస్తుత ప్రభుత్వానికి లేదని టీడీపీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వానికి ఆదాయ మార్గంగా వినియోగించుకునేందుకే ప్రాధాన్యత ఇస్తామని చెబుతున్నాయి.

### రుషికొండ ప్యాలెస్ విశేషాలు

రుషికొండ భవనంలో వాడిని టైల్స్ చదరపు అడుగు ధర రూ.26,000 గా చెల్లింపులు జరిపారు. బాత్ టబ్‌కు రూ.26లక్షలు చెల్లించారు.జగన్ నివాసం కోసం నిర్మించిన భవనాల్లో టాయ్‌లెట్ కమోడ్ ధర రూ.13.5 లక్షలు. జగన్ కుటుంబసభ్యులు మాత్రమే వాడుకునేలా 3 బెడ్‌రూమ్‌లలో వాటిని బిగించారు. మిగిలిన బాత్‌రూమ్‌లలోకమోడ్ ధర ఒక్కోటి రూ.6 లక్షలు ఖరీదు చేస్తాయి.రుషికొండ భవనాల్లో సోఫాలు, కుర్చీలు, టేబుళ్ల కోసం రూ.14 కోట్లు చెల్లించారు.ఇంటీరియర్ వర్క్‌కు రూ.19.5 కోట్లు విడుదల చేశారు. ఈ భవనాల్లో ఏ గోడకు ఏ చిత్రం అతికించాలనే దానికోసం ఇంటీరియర్ డిజైనర్లు కసరత్తు చేశారు. వీటికి రూ.19.5 కోట్లు ఖర్చు చేశారు.కరెంటు, నీరు, డ్రైనేజీ పనుల కోసంరూ.28 కోట్లు చెల్లించారు. నీటిసరఫరా, కరెంటు, సీవరేజ్ సౌకర్యాల కోసం ఇప్పటి వరకు రూ.28 కోట్లు ప్రభుత్వం చెల్లించింది.గార్డెన్ కోసం రూ.22 కోట్లు బిల్లులుగా విడుదల చేశారు. ఖరీదైన మొక్కలతో గార్డెన్ తీర్చిదిద్దడానికి రూ.22 కోట్లు ఖర్చు చేశారు.ఈ భవనాల్లో వాడిన సాధారణ ఫ్యాన్లకు కనీస ధర రూ.30వేల వరకు చెల్లించారు. బెడ్ రూమ్‌లలో వాడిని ఫ్యాన్ల ధరలు రూ.3లక్షల వరకు ఉన్నాయి. హాళ్లలో షాండ్లియర్‌లకు రూ.15 లక్షలు చెల్లించారు. జగన్ నివాసం కోసం నిర్మించిన భవనాల్లో మొత్తం 7 షాండ్లియర్లను ఒక్కో దానికి రూ.15 లక్షలు చెల్లించారు. ఇప్పటి వరకు రూ.470 ఖర్చు చేయగా మరో రూ.120 కోట్ల రుపాయల విలువైన పనులకు అమోదం తెలిపారు.

# ఏదో చేసేటట్టే ఉన్నాడే!

మొదటి పేజి తరువాయి



ఏపీలో అధికారంలోకి రావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని ప్లాన్ చేస్తున్నారు అధినేత.అధికారంలో ఉన్నప్పుడు పార్టీని చంద్రబాబు నిర్లక్ష్యం చేస్తారన్న విమర్శ ఉంది. దాని నుంచి అధిగమించేందుకు చంద్రబాబు ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మరో మూడు వారాల్లో ఇప్పుడు ఉన్న కార్యవర్గాలను పూర్తిగా రద్దు చేస్తారు. పార్లమెంట్ నియోజకవర్గాల అధ్యక్షులు, గ్రామ, అర్బన్, నగర, డివిజన్ అనుబంధ సంఘ కమిటీలు పూర్తిగా రద్దు అవుతాయి. అయితే ఈసారి పార్టీలో యువ రక్తం ఎక్కించాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఆరుపదులు దాటిన వారిని పక్కన పెట్టనున్నారు. అనుబంధ విభాగాలను మరింత బలోపేతం చేయనున్నారు. 25 పార్లమెంట్ స్థానాలను ప్రాతిపదికగా తీసుకుని అధ్యక్షులను నియమించనున్నారు. మొత్తం 25 పార్లమెంట్ స్థానాలకు గాను టిడిపి 16 చోట్ల విజయం సాధించిన సంగతి తెలిసిందే. పార్టీ ఎక్కడ బలహీనంగా ఉందో అక్కడ గట్టి నాయకుడిని అధ్యక్షుడిగా నియమించేందుకు కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది.మరోవైపు ఇటీవల ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని సాగనంపడానికి కూడా చంద్రబాబు డిసైడ్ అయినట్లు సమాచారం. ఏయే నియోజకవర్గాల్లో పార్టీకి ఏయే నేత వ్యతిరేకంగా పనిచేశారు వివరాలు తీసుకున్నారు. టికెట్లు దక్కలేదని, ఎలాగైనా పార్టీ అభ్యర్థులను ఓడించాలని చాలాచోట్ల సీనియర్లు ప్రయత్నించారు. అటువంటి వారి వివరాలను తెలుసుకునే పనిలో పడ్డారు చంద్రబాబు. దాదాపు అటువంటి వారిని పార్టీ నుంచి బహిష్కరించాలని నిర్ణయించారు. పొత్తులో భాగంగా టిడిపి 144 స్థానాల్లో పోటీ చేసింది. 135 చోట్ల విజయం సాధించింది. 9చోట్ల ఓటమి తప్పలేదు.అయితే ఆ తొమ్మిది నియోజకవర్గాల్లో ఓడిపోవడానికి కారణం ఏంటి? అక్కడ ఎవరెవరు సహకరించారు? ఎవరెవరు సహకరించలేదు? అన్న వివరాలను ఆరా తీసే పనిలో పడింది హై కమాండ్. మరో మూడు వారాల్లో టిడిపి నాయకత్వం పార్టీ ప్రక్షాళన దిశగా అడుగులు వేయనుండడం విశేషం.

## ఈవీఎంలపై జగన్ పాత వీడియోతో లోకేశ్ కౌంటర్

మొదటి పేజి తరువాయి

ఎన్నికల పద్ధతుల్లో పేపర్ బ్యాలెట్లు ఉపయోగిస్తున్నారు. ఈవీఎంలు కాదు. మన ప్రజాస్వామ్యం నిజమైన స్ఫూర్తిని నిలబెట్టుకోవడంలో మనం కూడా అదే దిశగా పయనించాలి." అని ట్వీట్ చేశారు.ఈవీఎంల హ్యాకింగ్, ట్యాంపరింగ్ పై ఇటీవల కాలంలో విమర్శలు వస్తున్నాయి. ఇది సాధ్యం కాదని ఎన్నికల సంఘం వారిస్తుంది. అయితే ప్రతిపక్ష పార్టీలు మాత్రమే ఈవీఎంలను హ్యాక్ చేస్తున్నారన్న ఆరోపణలు చేస్తున్నాయి. అయితే గెలిచినప్పుడు లేని అభ్యంతరాలు ఓటమి పాలైనప్పుడు ఎందుకు చేస్తున్నారని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.ఈవీఎంలపై మాజీ సీఎం వైఎస్ జగన్ చేసిన ఆరోపణలపై టీడీపీ నేతలు, మంత్రులు స్ట్రాంగ్ కౌంటర్లు ఇస్తున్నారు. గతంలో వైఎస్ జగన్ మాట్లాడిన వీడియోలను ఇందుకు బదులుగా పోస్టులు చేస్తున్నారు. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని టీడీపీ ఆరోపించింది. దీనిపై అప్పట్లో జగన్ స్పందిస్తూ...ఈవీఎంలను హ్యాక్ చేయడం సాధ్యం కాదని, వీవీప్యాట్ స్లిప్పుల్లో ఎవరికి ఓటు వేస్తున్నామో తెలుస్తుందన్నారు. ఈ వీడియోలను ప్రతిపక్షాలు వైసీపీ మీదకు ఎదురు సంధిస్తున్నాయి.జగన్ విమర్శలుపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. " మీకు ప్రజాస్వామ్యం అంటే ఎలర్జీ. ప్రజల హక్కులను పరిరక్షించడానికి అంకితమైన సంస్థలు, వ్యవస్థలను మీరు క్రమపద్ధతిలో నాశనం చేశారు. ఏళ్ల తరబడి ఏపీ ప్రజలు సమిష్టిగా నిర్మించిన వాటిని మీరు ఒక్క దెబ్బతో కొట్టిపారేశారు. మీరు 2019లో గెలిచినప్పుడు,ఈవీఎంలు అద్భుతంగా పనిచేశాయి. 2024లో ఓడిపోయినప్పుడు ఈవీఎంలను నిందిస్తున్నారు. బహుశా మీరు మీ పాలన గురించి ఆలోచిస్తే మంచిది. ప్రజలు మిమ్మల్ని పూర్తిగా తిరస్కరించారని అంగీకరించాలి. దీంతో పాటు ప్రభుత్వ వ్యయంతో కొనుగోలు చేసిన ఫర్నిచర్‌ను ఎప్పుడు తిరిగి ఇస్తున్నారు? రుషికొండ ప్యాలెస్ కట్టుకోవడానికి పేదల డబ్బు రూ.560 కోట్లు ఎందుకు వెచ్చించారు? ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సమాధానం కావాలి" అని లోకేశ్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

## హజ్ యాత్రలో మృత్యుఘోష.. ఈసారి 550 మందికి పైగా మృతి!

ఢిల్లీ: పవిత్ర హజ్ యాత్రలో ఎండ తీవ్రరూపం దాలుస్తోంది. ఎండలు, ఉక్కపోతతో యాత్రికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీని కారణంగా యాత్రకు వెళ్లిన భక్తులు పిట్టల్లా రాలుతున్నారు. ఈసారి యాత్రలో ఎండ వేడిమికి తాళలేక ఇప్పటివరకు 550 మందికి పైగా మృతిచెందారని మంగళవారం అరబ్ దౌత్యవేత్తలు తెలిపారు. ఇక చనిపోయిన వారిలో ఈజిప్ట్, జోర్డాన్ దేశస్తులు అధికంగా ఉన్నారు. సుమారు 323 మంది ఈజిప్టియన్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే 60 మంది జోర్డానియన్లు కూడా మరణించారని తెలిపారు. మొత్తంగా ఇప్పటివరకు చనిపోయిన వారి సంఖ్య 577కి చేరినట్లు తెలుస్తోంది. వీరంతా వేడి సంబంధిత సమస్యలతోనే మరణించినట్లు వెల్లడించారు. వేడిమి నుంచి ఉపశమనం కలిగించేందుకు అక్కడి అధికారులు చర్యలు తీసుకుంటున్నా ప్రాణ నష్టం తప్పడం లేదు. ఇక మక్కాలోని అతిపెద్ద ఆసుపత్రులలో ఒకటైన అల్-ముయిసెమ్ ఆసుపత్రి మార్చురీలో మొత్తం 550 మృతదేహాలు ఉన్నట్లు దౌత్యవేత్తలు తెలిపారు. వేడి సంబంధిత సమస్యలతో బాధపడిన సుమారు 2,000 మంది యాత్రికులకు చికిత్స అందించినట్లు సౌదీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం మక్కాలో 50 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మక్కాలోని గ్రాండ్ మసీదు వద్ద సోమవారం 51.8 డిగ్రీల సెల్సియస్ (125 ఫారెన్‌హీట్) ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని సౌదీ జాతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో హజ్ యాత్రకు వెళ్లిన భక్తుల కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. కాగా ప్రతి దశాబ్దం సౌదీ అరేబియాలో 0.4 డిగ్రీల వేడి పెరుగుతుండడం ఆందోళన కలిగించే అంశం. ఈ హజ్ యాత్ర ఈనెల 19వ తేదీతో (బుధవారం) ముగియనుంది. ఇక గతేడాది కూడా హజ్ యాత్రలో 240కి పైగా మరణాలు నమోదయ్యాయి.

ఈ మతపరమైన కార్యక్రమం ద్వారా సౌదీ అరేబియా ఏడాదికి 12 బిలియన్ డాలర్లు ఆర్జిస్తుంది. విజన్ 2030 రోడ్‌మ్యాప్‌లో భాగంగా సౌదీ అరేబియా 2030 నాటికి హజ్, ఉమ్రా రెండింటి ద్వారా మతపరమైన పర్యాటకుల సంఖ్యను 30 మిలియన్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇక ఈ యాత్రలు చేసే పర్యాటకులు ఆహారం, ప్రయాణం, వసతి, ఇతర వాటికి వెచ్చించే నగదుతో ఆ దేశ ఖజానాకు భారీ ఆదాయం సమకూరుతోంది. కాగా, హజ్ ఖర్చు ఒక వ్యక్తికి 3 వేల డాలర్ల నుంచి 10 వేల డాలర్ల మధ్య ఉంటుందని అంచనా.

# టమాట మంటలు.. మరో వారం రోజుల్లో కిలో రూ.200కు చేరే ఛాన్స్!




హైదరాబాద్: దేశ వ్యాప్తంగా కూరగాయల ధరలు తారెత్తిస్తున్నాయి. మరోవైపు టమాట ధరలు నానాటికీ దూసుకుపోతున్నాయి. రోజురోజుకూ అంతకంతకు పెరుగుతున్న ధరలతో సామాన్యుడు బెంబేలెత్తిపోతున్నాడు. వారం కిందటి వరకు కిలో టమాట ధర రూ.30 నుంచి రూ.50 వరకు ఉంటే ఇప్పుడు ఏకంగా రెట్టింపై రూ.100కు చేరింది. ఆకాశాన్నంటుతున్న ధరలతో ఏం కొనలేని పరిస్థితి నెలకొంది. దీంతో కూరగాయల ధరలు సామాన్యులకు మోయలేని భారంగా మారిపోయాయి. ప్రతి వంటకంలోనూ తప్పనిసరిగా ఉపయోగించే టమాట ఇప్పుడు భారంగా మారుతోంది. రోజురోజుకూ పెరుగుతున్న టమాట ధరలు ఇటు ప్రజలతోపాటు అటు రీటైల్ మార్కెట్‌ను వణికిస్తోంది. గత కొద్ది రోజులుగా కూరగాయల ధరలు పెరుగుతూనే వస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ మార్కెట్లలో కిలో టమాట రూ.100 పలుకుతోంది. నాగర్‌కర్నూల్ రైతుబజార్‌లో కిలో టమాట ధర రూ.100కు చేరింది. కూరగాయలు కొనలేక ఆకుకూరలతో సరిపెట్టుకుందామంటే వాటి ధరలు కూడా మండిపోతున్నాయి. వారం క్రితం పాలకూర, తోటకూర, గోంగూరలాంటి ఆకుకూరలు గతంలో రూ.10కి 5 కట్టల చొప్పున ఇవ్వగా ఇప్పుడు రూ.20కి 3 లేదా 4, 5 చొప్పున అమ్ముతున్నారు. మరోవైపు మిర్చి ధర కూడా కిలో రూ.100 దాటింది. ఉల్లి కూడా ఘాటెక్కింది. ఈసారి సకాలంలో వానలు కురవకపోవడంతో కూరగాయల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. గత 15 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు అప్పటికే పొలాల్లో ఉన్న టమాట పంట దెబ్బతింది. దీంతో చాలా వరకు గ్రామల నుంచి పంట మార్కెట్లకు రావడం ఆగిపోయింది. స్థానికంగా టమాటలు దొరక్కపోవడంతో టమాట ధరలు పెరిగాయి. పరిస్థితులు ఇలాగే ఉంటే రాబోయే వారం, పది రోజుల్లో టమాట ధరలు రూ.200 వరకు చేరే అవకాశం ఉంది. టమాటనే కిలో రూ.100 ఉంటే మిగిలిన కూరగాయలు ఎలా కొనాలని సామాన్యులు వాపోతున్నారు. అటు ఏపీలోనూ పరిస్థితి ఇలాగే ఉంది. అక్కడ కిలో టమాట రూ.80 ఉండగా.. రవాణా ఛార్జీలు కలుపుకుని కొన్ని చోట్ల రూ.100 అమ్ముతున్నారు. స్థానిక మార్కెట్లలో మరో 2 రోజుల్లో రూ.100కు చేరే అవకాశం ఉంది. వర్షాభావ పరిస్థితుల వల్ల ఉత్పత్తి పడిపోవడంతో 60 శాతం దిగుబడి తగ్గడమే ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లె, పలమనేరు నుంచి, కర్ణాటకలోని చింతామణి.. వంటి ఇతర ప్రాంతాల నుంచి టమోటాలు దిగుమతి అవుతున్నాయని హోల్‌సేల్ మార్కెట్ యార్డు అధికారులు చెబుతున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు 25 కిలోల టమాటాను రూ.1500 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. రవాణా, కూలీలు, ఇతర ఖర్చులు కలిపి రిటైలర్లకు కిలో రూ.75, వినియోగదారులకు రూ.80 నుంచి రూ.90 వరకు విక్రయిస్తున్నారని తెలిపారు.

## మానుకోట టౌన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా బట్టు దేవ్ సింగ్ నియామకం





మానుకోట జిల్లా(**గౌతమ్ న్యూస్** ): మానుకోట మున్సిపాలిటీ పరిధిలో టౌన్ ఉపాధ్యక్షులుగా బట్టు దేవ్ సింగ్ ని నియమించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా పార్టీ అర్బన్ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య. నూతనంగా ఎన్నుకోబడిన బట్టు దేవ్ సింగ్ మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్, జిల్లా పార్టీ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ గణపురం అంజయ్య, అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. మానుకోట జిల్లా కేంద్రంలో రేషన్ కార్డులు, కరెంటు స్తంభాలు, ఇందిరమ్మ ఇల్లు, బాత్రూంలు, కరెంటు మీటర్లు, ప్రజలు కావాల్సిన అవసరాల నిమిత్తం కరోనా కాలంలో చాలా కృషి చేశాము. ముందు ముందు ఇంకా చాలా పని చేయాల్సి ఉంది. నాపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన పెద్దలకు మరోసారి ధన్యవాదాలు. ఈ కార్యక్రమంలో 26 వార్డ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి వెంకన్న, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పీసీసీ మెంబెర్ దండెం వెంకన్న, వంగూరి పరుశరాములు, వార్డ్ ప్రధాన కార్యదర్శి భూక్యా సురేష్ నాయక్, రమణబోయిన వీరన్న, ఇమ్రాన్ ఎండీ, కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



మెట్పల్లి(**గౌతమ్ న్యూస్** ): కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వడి నర్సింగరావు ఆదేశాల మేరకు శ్రీ రాహుల్ గాంధీ జన్మదిన పురస్కరించుకొని మెట్పల్లి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి మెట్పల్లి పట్టణ అధ్యక్షుడు జెట్టిలింగం.. 7వార్డ్ ఇంచార్జ్ జాకీర్.. షేక్ మమ్మద్ కాంగ్రెస్ నాయకులు. తదితరులు పాల్గొన్నారు

## కేసముద్రంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



మానుకోట జిల్లా / కేసముద్రం(**గౌతమ్ న్యూస్** ): బుధవారం కేసముద్రం పట్టణంలో భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు పట్టణ అధ్యక్షులు రావుల మురళి ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు పాల్గొని కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండీ ఆయుబ్ ఖాన్, మాజి ఉపసర్పంచ్ వెంకన్న, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు అల్లం గణేష్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండి రఫీ ఖాన్, బలు, ఎండీ రషీద్ ఖాన్, ఎండీ నవాజ్ అహ్మద్, బాదవత్ సుమన్, కమాల్, బానోత్ నరేష్, శ్రీను, ఎండీ అలీం, బోడ విక్కి, విజేందేర్, ముజ్జు, అరుణ్, సేవాల్, రాకేష్, యశ్వంత్, ప్రభు, ఎండి నూరోద్దీన్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ మండలంలోని పాలమాకుల గ్రామంలో కుక్కల దాడికి దుప్పి మృతి చెందింది



శంషాబాద్ (**గౌతమ్ న్యూస్** ): శంషాబాద్ మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో కుక్కల దాడికి దీప్తి మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు కిలోమీటర్ దూరం నుంచి లేడిని తరుముకుంటూ వస్తుండగా దుప్పి భయభ్రాంతులకు గురై మరణించింది. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. దుప్పి ఎక్కడినుంచి ఎక్కడికి వెళ్లే కోణంలో పరిశీలన చేశారు. పంట పొలాలలో పని చేస్తున్న రైతులు మాట్లాడుతూ గతంలో కూడా ప్రక్కన గ్రామంలో కుక్కల దాడికి లేడీ మృతి చెందింది ఇప్పుడు కూడా కుక్కలు దుప్పి పై దాడి చేయడంతో అక్కడికక్కడే భయభ్రాంతులకు గురై చనిపోయిందని అన్నారు కనుక అధికారులు మరియు జిహెచ్ఎంసి అధికారులు స్పందించి కుక్కల తొలగించాలని కోరారు. గ్రామాలలో కుక్కల విషయాలకు వస్తే చిన్నపిల్లలను పీకతినే స్థాయిలో ఉన్నాయని అన్నారు కనుక స్పందించి వెంబడే ఈ కుక్కలపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికుడు నరసింహారెడ్డి. రైతులు

## పెళ్లైన మూడు నెలలకే ఆత్మహత్య



నల్లబెల్లి (గౌతమ్ న్యూస్ ): మండల కేంద్రానికి చెందిన వీర్ల రమేష్- రమ దంపతుల కూతురు వైష్ణవి ములుగు జిల్లా వెంకటాపురం వాసి చెందిన ప్రశాంత్ తో మూడు నెలల క్రితం వివాహం జరిపించారు అత్తగారింటి వేధింపులు భరించలేక మంగళవారం పుట్టింటికి వచ్చిన వైష్ణవి బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడింది కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతి చెందింది.

# మహబూబాబాద్ పట్టణంలోని ఏరియా హాస్పిటల్ లో నిర్వహించిన సికిల్ సెల్ అనీమియా నిర్మూలన ప్రత్యేక అవగాహన కార్యక్రమం

(గౌతమ్ న్యూస్ ): ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ పట్టణంలోని ఏరియా హాస్పిటల్ లో నిర్వహించిన సికిల్ సెల్ అనీమియా నిర్మూలన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి. ఈ సందర్భంగా సికిల్ సెల్ అనీమియా నిర్ములాన కొరకు సూచనలు చేశారు. అనంతరం నిర్ధారణ పరీక్షలను పరిశీలించి సికిల్ సెల్ జెనెటిక్ స్టేటస్ కార్డ్లను పంపిణీ చేశారు. కేంద్ర మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా సికిల్సెల్ అనీమియాను నిర్మూలించడానికి ఎంతగానో కృషిచేస్తున్నాయి. దానిలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, ఖమ్మం, నిర్మల్ కుమ్రంభీం ఆసిఫాబాద్, నాగర్కర్నూల్, ములుగు, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్, నల్గొండ, మహబూబ్నగర్, రంగారెడ్డి మొదలగు 14 జిల్లాలలో సికిల్సెల్ ఎలిమినేషన్ మిషన్ కార్యక్రమం కొనసాగుతున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేషనల్ సికిల్సెల్ ఎలిమినేషన్ మిషన్ ను 01-07-2023 రోజున మధ్యప్రదేశ్ లోని షహదోల్లో ప్రారంభించారు. ఆదివాసీ సముదాయాలకు చెందిన ప్రజల






జీవితాలకు భద్రత కల్పించి సికిల్ సెల్ అనీమియా నుండి విముక్తితో పాటు ఈ వ్యాధి బారిపడిన 2.5 లక్షల మంది పిల్లలు, కుటుంబాల జీవితాలను రక్షించాలని సంకల్పించారు. సికిల్ సెల్ వ్యాధి, ముఖ్యంగా గిరిజన జనాభాలో ఎదురవుతున్న ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడం ఈ మిషన్ యొక్క ముఖ్య లక్ష్యం, ప్రజారోగ్య సమస్యగా ఉన్న ఈ సికిల్సెల్ వ్యాధిని 2047 నాటికి పూర్తిగా తొలగించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో ఈ ప్రయోగం ఒక కీలక మైలురాయిగా నిలుస్తుంది. నేషనల్ సికిల్ సెల్ అనీమియా ఎలిమినేషన్ మిషన్-2023 కేంద్ర వార్షిక బడ్జెట్లో ప్రకటించడం జరిగింది. ప్రస్తుతం దేశంలోని 17 హై ఫోకస్ రాష్ట్రాలలోని 278 జిల్లాలలో ఈ పథకం అమలు అవుతుంది.

### సికిల్ సెల్ అనీమియా అంటే ఏమిటి?

సికిల్సెల్ వ్యాధి లేదా సికిల్సెల్ అనీమియా అనేది ఒక వంశానుగత రక్త రుగ్మత, సాధారణంగా మనిషి రక్తంలోని ఎర్ర రక్తకణాలు గుండ్రని ఆకారంలో ఉంటాయి. ఈ కణాలు రక్తనాళాల ద్వారా శరీరమంతా ప్రయాణిస్తూ వివిధ అవయవాలకు ప్రాణవాయువుని(ఆక్సిజన్) సరఫరా చేస్తుంటాయి. అయితే కొంతమందిలో జన్యు సంబంధ మార్పుల వల్ల ఎర్ర రక్తకణాలు కొడవలి(సికిల్) ఆకారంలోకి మార్పు చెందుతాయి. ఈ సికిల్సెల్ ఉన్నవారి రక్తకణంలోని ఒక జన్యువు సికిల్సెల్గాను, ఒకటి - మామూలుగాను ఉన్నట్లయితే అటువంటి వారిని సికిల్సెల్ క్యారియర్లు అంటారు. వీళ్ళకి మామూలుగా ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. అయితే వివాహం చేసుకున్న దంపతుల ఇద్దరికీ ఇటువంటి లక్షణాలు ఉన్నట్లయితే వారికి పుట్టే పిల్లలకు రక్తకణంలోని రెండు జన్యువులు వంపు తిరికి ఉంటాయి. అటువంటి పిల్లలకు పుట్టుకతోనే సమస్యలు మొదలవుతాయి. సాధారణ రక్తకణాల జీవితకాలం 120 రోజులైతే సికిల్సెల్ రక్తకణాల జీవితకాలం 20-25 రోజులు మాత్రమే. సికిల్ రక్తకణాలు నశించిపోయేంత వేగంగా కొత్త ఎర్ర రక్తకణాలు ఉత్పత్తి కాకపోవడంతో ఈ వ్యాధిఉన్నవారు రక్తహీనతకు గురవుతారు. అంతేకాక సికిల్ రక్తకణాలు వంపు తిరికి ఉండడం వల్ల సన్నటి రక్తనాళాల్లో సరిగ్గా ప్రవహించలేక శరీర భాగాలకు ఆక్సిజన్ అందటం తగ్గిపోతుంది. అందువలన ఈ వ్యాధి ఉన్నవారు తగిన చికిత్స తీసుకోకపోతే తీవ్రమైన సమస్యలతో బాధపడవలసి వస్తుంది. జన్యుపరమైన మార్పులు వచ్చే ఈ రక్తహీనత జబ్బుకు సరైన మందులు లేవు.

### సికిల్ సెల్ వ్యాధి లక్షణాలు

సికిల్ సెల్ వ్యాధి యొక్క లక్షణాలు సాధారణంగా 6 నెలల వయస్సులో ప్రారంభమవుత్తాయి. అవి ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి భిన్నంగా ఉంటాయి మరియు అవి కాలక్రమేణా మారవచ్చు.

### ఉదాహరణకు ఈ క్రింది సంకేతాలు మరియు లక్షణాలు

రక్త హీనత/ దీర్ఘకాల కామెర్లు (జాండీస్) ఉండటం, కీళ్ళ దగ్గర, ఛాతీ దగ్గర మరియు నడుము వద్ద తీవ్రమైన నొప్పులు ఉండుట, చేతులు మరియు కాళ్ళు వాపు, ఇన్ఫెక్షన్లు తరచుగా సంభవిస్తాయి, యుక్త వయస్సు లేదా పెరుగుదలలో జాప్యం, దృష్టి సమస్యలు.

### సికిల్ సెల్ అనీమియా యొక్క సమస్యలు

స్ట్రోక్, తీవ్రమైన ఛాతినొప్పి, పూపూస రక్తపోటు, అవయవ నష్టం, అంధత్వం, లెగ్స్ అన్సర్, పిత్తాశయ రాళ్లు, ప్రైపిసం, డీప్ సిర రంధ్రము, గర్భధారణ సమస్యలు. మీరు సికిల్ సెల్ అనీమియా లక్షణాన్ని కలిగి ఉన్నట్లయితే, గర్భం ధరించడానికి ప్రయత్నించే ముందు జన్యు సలహాదారుని చూడటం వలన సికిల్ సెల్ అనీమియాతో బిడ్డ పుట్టే ప్రమాదాన్ని మీరు అర్థం చేసుకోవచ్చును. ఒక జన్యు సలహాదారు మీతో చికిత్స ఎంపికలు, నివారణ చర్యలు మరియు పునరుత్పత్తి ప్రత్యామ్నాయాలను కూడా చర్చించవచ్చును.

### సికిల్ సెల్ అనీమియా చికిత్స

సికిల్ సెల్ అనీమియాకు చికిత్స ప్రధానంగా నొప్పి ఎపిసోడ్లను తగ్గించడం, లక్షణాలను తగ్గించడం మరియు పరిణామాలను నివారించడంపై దృష్టి పెడుతుంది.

### మందులు

హైడ్రాక్సీయూరియా (డ్రోక్సియా, హైడ్రియా, సిక్లోస్), ఎల్-గ్లుటమైన్ ఓరల్ పౌడర్ (ఎండారి), క్రిజాట్రజుమాబ్ (అడక్వేయో), వోక్సెలోటర్ (ఆక్స్ బ్రిటా), నొప్పిని తగ్గించే మందులు వంటి కొన్ని మందులను డాక్టర్ ఈ పరిస్థితుల నిర్వహణకు సూచిస్తారు.

### శస్త్రచికిత్స మరియు ఇతర జోక్యాలు

మందులు ఎటువంటి ఉపశమనాన్ని అందించకపోతే, శస్త్రచికిత్సా పద్ధతులు సూచించబడతాయి.

### రక్తమార్పిడి

ఇవి స్ట్రోక్ వంటి సికిల్ సెల్ వ్యాధి ఉన్నవారిలో సమస్యలకు చికిత్స చేయడానికి మరియు నిరోధించడానికి ఉపయోగిస్తారు. ఎర్ర రక్తకణాలు దానం చేయబడిన రక్తం నుండి తీసుకోబడతాయి మరియు ఎర్ర రక్తకణాల మార్పిడిలో సికిల్ సెల్ అనీమియా ఉన్న వ్యక్తికి సిర ద్వారా సరఫరా చేయబడతాయి. ఇది సాధారణ ఎర్ర రక్తకణాల పరిమాణాన్ని పెంచడం ద్వారా లక్షణాలు మరియు పరిణామాలను తగ్గించడంలో సహాయపడుతుంది.

### మూల కణాల మార్పిడి

ఎముక మజ్జ మార్చిడి అని కూడా పిలువబడే ఈ శస్త్రచికిత్సలో సికిల్సెల్ అనీమియా బాధిత ఎముక మజ్జను దాత నుండి ఆరోగ్యకరమైన ఎముక మజ్జతో భర్తీ చేస్తారు. సికిల్ సెల్ అనీమియా లేని తోబుట్టువు వంటి సరిపోలిన దాత తరచుగా శస్త్రచికిత్సలో ఉపయోగించబడుతుంది.

### జీవనశైలి మార్పులు మరియు స్వీయ సంరక్షణ

ఈ వ్యాధిని నియంత్రించడానికి మీరు చేయవలసిన జీవనశైలి మార్పులు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

### చేయవలసిన పనులు

నీటిని పుష్కలంగా త్రాగాలి, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి, హిమోగ్లోబిన్ కు మేలు చేసే పండ్లను తీసుకోవాలి, క్రమంతప్పకుండా వ్యాయామం చేయాలి, ఫోలిక్ యాసిడ్ సప్లిమెంట్లను తీసుకోవాలి.

### చేయకూడని పనులు

స్మోక్ (పొగ త్రాగటం), ప్రిస్క్రిప్షన్ లేని మందులు వాడటం, తీవ్రమైన వేడి లేదా చల్లని ఉష్ణోగ్రతలో బయటకు వెళ్లడం, మీ లక్షణాలు మరింత దిగజారిపోయే వరకు వేచి ఉండడం, రెగ్యులర్ చెకప్స్ మరియు డాక్టర్ అపాయింట్మెంట్స్ చేసుకోకపోవడం. ఈ కార్యక్రమంలో డీ.ఎం.హెచ్.ఓ కళావతి భాయి, డిప్యూటీ డీ.ఎం.హెచ్.ఓ అంబాల అంబరీష, సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వర్ రావు, నోడల్ ఆఫీసర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ కమ్యూనిస్టు నేత ఆకుల లక్ష్మయ్య 18వ వర్ధంతి సభ

## సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గునగంటి రాజన్న కొనియాడారు

మానుకోట జిల్లా (**గౌతమ్ న్యూస్** ): ఆదర్శ కమ్యూనిస్టు నేత కామ్రేడ్ ఆకుల లక్ష్మయ్య స్ఫూర్తితో ప్రజా పోరాటాలను ముందుకు తీసుకపోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గుణగంటి రాజన్న అన్నారు. బుధవారం ఆకుల లక్ష్మయ్య 18 వర్ధంతిని పురస్కరించుకొని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్ అధ్యక్షతన వర్ధంతి సభ జరిగింది. ఈ సభకు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గుణగంటి రాజన్న ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆకుల లక్ష్మయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అల్వాల వీరయ్య పూలమాల వేసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. రాజన్న మాట్లాడుతూ నాడు మహబూబాబాద్ తాలూకాలో సిపిఎం పార్టీ అభివృద్ధికి తన ఇల్లే పార్టీ కార్యాలయంగా మార్చి, పార్టీ నిర్మాతల్లో ఒకరిగా పార్టీని విస్తరింప చేశారు. చివరికంటూ ఎర్ర జెండా ఆశయానికి కట్టుబడి ఆదర్శ నేతగా ఆకుల లక్ష్మయ్య కొనసాగారని కొనియాడిరు. ఓంకార్ పార్టీని వీడిన అనంతరం సిపిఎం పార్టీ పునర్నిర్మాణంలో ఆకుల లక్ష్మయ్య కృషి ఎనలేనిదని అన్నారు. అనేక ఆటుపోట్లు, బూర్జువా పార్టీల, పోలీసు నిర్బంధాలు పార్టీ పై దాడులు తీవ్ర నిర్బంధాల మధ్య మానుకోటలో సిపిఎం పార్టీని నిర్మించిన నాయకుల్లో ఆకుల లక్ష్మయ్య ఒకరు అని అన్నారు. కార్యకర్తకు కష్టం వచ్చిందంటే పోలీసు నిర్బంధమైన క్యాడర్ కు ధైర్యాన్ని ఇచ్చి వెన్ను తట్టి నిలబెట్టే వారని అన్నారు. కుటుంబాన్ని సైతం పట్టించుకోకుండా పార్టీ కర్తవ్యాలే తన ప్రధాన కర్తవ్యంగా పయనించారని అన్నారు.



తాను నమ్మిన సిద్ధాంతం కొరకు తన కుటుంబాన్ని సైతం ఆ సిద్ధాంత బాటలో నడిపించారని అన్నారు. ఈ వర్ధంతి సభలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అల్వాల వీరయ్య మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమ కార్యకర్త నుండి నాకు లక్ష్మయ్య పరిచయం ఉందన్నారు. చిన్నతనంలో పార్టీలో కార్యకర్తగా ఉద్యమ అనుభవాలు ఎన్నో చెప్పి ప్రోత్సహించేవారని అన్నారు. వారి ఆశయాలు, ఆదర్శాలు ఎంతో ప్రేరణకు గురి చేసేవని తెలిపారు. ఆకుల లక్ష్మయ్య వారసుడు నీ ఉద్యమ వారసుడిగా చేయటంలో మా నాన్న ఆశయానికి నేను ఉద్యమంలో ఉన్నందుకు ఎంతో అదృష్టంగా స్ఫూర్తిగా భావిస్తున్నాను అని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు తన తండ్రి ఆకులు లక్ష్మయ్య ఉద్యమ ప్రస్థానాన్ని కుటుంబ నేపథ్యంలో ఎలా ఉండేవారని లక్ష్మయ్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కుర్ర మహేష్, సమ్మెట రాజమౌళి, దుడ్డెల రామ్మూర్తి, భూక్య హరినాయక్, సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు అల్లి శ్రీనివాస్ రెడ్డి, చీపిరి యాకయ్య, రావుల రాజు, కుమ్మరి కుంట్ల నాగన్న, బూర్గుల లక్ష్మణ్, బానోతు ప్రకాష్, భానోత్ కిరణ్ కుమార్, మచ్చ వెంకన్న, గాడిపెల్లి శ్యామ్, రాపోలు ఐలయ్య, వెంకటాద్రి శ్రీనివాస్ నాయుడు, మామోజి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలి

## ఐయాఫ్టియు మానుకోట జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి.

మరిపెడ (**గౌతమ్ న్యూస్** ): మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కార్యాలయంలో కార్మిక కనీస వేతనం గురించి వినతి పత్రం సమర్పించారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీలలో సేవలందిస్తున్న కార్మికులందరికీ కనీస వేతనం 26,000 ఇవ్వాలని భారత కార్మిక సంఘాల సమైక్య (ఐ యాఫ్ టి యు)మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. నేడు మరిపెడ బంగ్లా మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ కు ఒక వినతిపత్రం ప్రతినిధి బృందంగా ఇచ్చారు.అనంతరం రవి మాట్లాడుతూ పెరిగిన జీవన ప్రమాణ స్థాయిని దృష్టిలో ఉంచుకొని ప్రతి కుటుంబం కనీస అవసరాలు తీరటానికి 26వేల వేతనం ఇవ్వాలని ప్రభుత్వ నియమీంచిన కమిషన్ సూచించిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంకా రవి మాట్లాడుతూ మరిపెడ మున్సిపల్ కార్మికులకు సబ్బులు కొబ్బరి నూనె గత సంవత్సర



కాలంగా ఇవ్వడం లేదని, పిఫ్ బకాయి ఉందని అన్నారు.ఈఎస్ఐ సౌకర్యం లేక కార్మికులు వారి కుటుంబాలు అనారోగ్య పాలైతే ప్రైవేట్ హాస్పిటల్స్ లో లక్షలు ఖర్చు చేస్తూ అప్పులపాలవుతున్నారని ఆవేదన తో అన్నారు. రానున్న వర్షాకాలం సీజన్లో ప్రతి కార్మికుడికి రైన్ కోట్ ఇతర రక్షణ పరికరాలను వెంటనే ఇవ్వాలని ఆయన కోరారు.ప్రతినెల 5వ తారీఖున కార్మికులకు వేతనాల ఇవ్వాలని ఆయన కోరారు. స్పందించిన మేనేజర్ సంపత్ కుమార్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఇంకా ఈ కార్యక్రమంలో నాగయ్య, రామ్ లాల్, ఉప్పలయ్య, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నాసిరకం పనులతో హైవేపై గుంతల పూడ్చివేత




నల్లబెల్లి (గౌతమ్ న్యూస్ ): జాతీయ రహదారి పై ఏర్పడిన గుంతల పుడ్చివేత పనుల్లో నాణ్యత కొరబడిందని వాహనదారులు ఆరోపిస్తున్నారు.. ములుగు జిల్లా మల్లంపల్లి నుంచి నర్సంపేట వరకు చేపడుతున్న గుంతల పూడ్చివేత పనుల్లో కాంట్రాక్టర్ పాటించింది నాణ్యత చేసింది పని ఉన్నట్లు మారిందని వారు పేర్కొంటున్నారు అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చాడని విమర్శలు వస్తున్నాయి 365 జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చివేసే సమయంలో గుంత చుట్టూ ధ్వంసమైన బీటీని తొలగించాలి గుంతల్లో దుమ్ము రాళ్ళు తీసివేయాలి ఆ తర్వాత గుంతల్లో బీటి వేసి రోలింగ్ చేయాలి కానీ అవేమీ పట్టనట్టుగా కాంట్రాక్టర్ బి టు మెన్ ఎమల్ షన్ చల్లి డస్టుతో కూడిన కంకర ను గుంతల్లో పోసి దానిపై బీటుమెన్ ఎమల్షన్ పోస్తున్నారు ఇలా పనులు చేస్తే లక్షల్లో నిధులు దుర్వినియోగం కావడంతో పాటు అనతి కాలంలోనే తిరిగి గుంతలు ఏర్పడే అవకాశం ఉంటుందని వాహనదారులు వాపోతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి జాతీయ రహదారిపై గుంతల పూల్చివేత పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


## చేయూతనిద్దాం... చెయ్యి అందిద్దాం



నల్లబెల్లి(గౌతమ్ న్యూస్ ): సెల్యూజర్ వ్యాధితో బాధపడుతున్న మహిళ చికిత్సకు ఇప్పటికే మూడు లక్షల వరకు ఖర్చు మరో ఐదు లక్షలు ఖర్చు అవుతాయి అంటున్న వైద్యులు దాతలు ఆదుకోవాలని కుటుంబీకుల వేడుకోలు అప్పటివరకు పొలం పనులు చేసి కుటుంబీకులతో సంతోషంగా గడిపిన ఆ మహిళ ఒక్కసారిగా స్పృహ తప్పి కింద పడిపోయింది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ తరలించారు పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు సెల్యూజర్ (మెదడులో రక్తం గడ్డ కట్టడం వ్యాధిగా నిర్ధారించారు) దీంతో వైద్యానికి డబ్బు లేక నిరుపేద కుటుంబీకులు తల్లడిల్లుతున్నారు వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మూడు చెక్కలపల్లి గ్రామానికి చెందిన తేజావత్ తీతామన్- యాకమ్మ దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపిన యాకమ్మ ఈనెల 7 వ తేదీన రాత్రి ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయింది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు అయితే పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హనుమకొండలోని ఓ ప్రవేట్ హాస్పిటల్ లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు ఇప్పటికే సుమారు 3 లక్షల వరకు ఖర్చు అయింది వైద్యానికి మరో 5 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పడంతో దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దీనిపై దాతలు స్పందించి సాయం చేసి బతుకునివ్వాలని కుటుంబీకులు వేడుకుంటున్నారు. దాతలు.. ఫోన్ పే, గూగుల్ పే ,పేటీఎం నంబర్ 6301821622 పేరు: తేజావత్ రాజేష్, బ్యాంకు పేరు: ఇండియన్ పోస్ట్ బ్యాంకు అకౌంట్ నంబర్ :052210092280, IFSC CODE IPOS0000 DOP సాయం చేయాలని వేడుకుంటున్నారు.

## సమీకృత కలెక్టరేట్ నిర్మాణం పనుల్లో వేగం పెంచాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



ఏటూరునాగారం(గౌతమ్ న్యూస్ ): ములుగు జిల్లా స్టాపర్: సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు మండలం బండారుపల్లి పరిధిలో 16 ఎకరాల స్థల విస్తీర్ణంలో 47 కోట్ల రూపాయల నిధులతో జరుగుతున్న సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్మాణ పనులలో వేగం పెంచాలని సంబంధిత కాంట్రాక్టర్ ను, సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో నిర్మాణ పనులకు అంతరాయం ఏర్పడితే బిల్డింగ్ అంతర్గత పనులను పూర్తి చేయాలని సూచించారు. కలెక్టరేట్ నిర్మాణ బ్లూ ప్రింట్ ను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు నిర్మాణ ఆకృతి, తదితర అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల పురోగతి తమకు రోజు వారీగా తెలియజేయాలని, పనులలో నిర్లక్ష్యం వహించకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి. శ్రీజ, డి ఈ వెంకటరమణ , ఏ ఈ రాకేష్ , ములుగు తహసిల్దార్ విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ లో రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు



శంషాబాద్ (గౌతమ్ న్యూస్ ): రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల్ అధ్యక్షులు శేఖర్ యాదవ్ మున్సిపాలిటీ అధ్యక్షులు సంజయ్ యాదవ్ గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా శంషాబాద్ అంబేద్కర్ స్టాచ్యూ దగ్గర పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకోవడం జరిగినది ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఎస్సి డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు నరేందర్ . డీసీసీ అధికార ప్రతినిధి సులోచన .బొబ్బిలి కిష్టయ్య .కౌన్సిలార్లు బండి శ్రీకాంత్ యాదవ్ అమృత రెడ్డి. మాక్యూర్ శ్రీకాంత్ యాదవ్. భాస్కర్ రెడ్డి ఎంపీటీసీ అశోక్ మాజీ సర్పంచ్ లు రమేష్ యాదవ్ ప్రవీణ్ యాదవ్ పరమేష్ శ్రీధర్ యాదవ్ ex సర్పంచ్ లింగం యాదవ్ నాజిర్ బాయి మీట్టు బాయి అక్రమ్ బాయి శ్రీధర్ శంషాబాద్ మండల్ ఉపాధ్యక్షులు బంగారు కుమార్ చందు యాదవ్ శేఖర్ యాదవ్ రాకేష్ మహేష్ సంజు ఆదర్శ్ ముదిరాజ్ దేవేందర్ కిరణ్ . కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



మెట్పల్లి(గౌతమ్ న్యూస్ ): కాంగ్రెస్ పార్టీ అధినేత శ్రీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ కొమిరెడ్డి కరంచంద్ ఆదేశాల మేరకు బుధవారం మెట్పల్లి పట్టణంలోని ఆయన నివాస పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు ఎండి రైసోద్దీన్ మాట్లాడారు. కోట్లాది దేశ ప్రజల గొంతుక భారతదేశ ఆశయసాధకుడు నేటి యువతరానికి ఆదర్శవంతుడైన రాహుల్ గాంధీ ఆలోచనలు ఆయన జీవితం భావితరానికి అనుసరణీయ మార్గమని కొనియాడారు. ఆయన ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో ఉంటూ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వేముల శ్రీనివాసరావు, బర్ల వంశీ, పెంట ప్రణయ్, పల్లికొండ ప్రవీణ్, సింగని మారుతి, గడప విమల్, రాజారెడ్డి, బన్నీ, అక్షయ్, శివ తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రంలోనే ములుగు జిల్లాను ప్రగతిపథంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలి

## ప్రతి ఇంటికి సురక్షిత త్రాగునీరు అందించాలి.

ఏటూరునాగారం (వెంకటాపూర్)(గౌతమ్ న్యూస్ ): ములుగు జిల్లా స్టాపర్: త్రాగునీటి పైపు లైన్ లీకేజీ మరమ్మతు పనులను వెను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్రంలోనే ములుగు జిల్లాను ప్రగతిపథంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలని, ప్రతి ఇంటికి సురక్షిత మంచి నీటిని అందించాలని రాష్ట్ర పంచాయితీ రాజ్



గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ



సీతక్క అన్నారు. బుధవారం వేంకటాపూర్ మండల కేంద్రం లో 49.53 లక్షల రూపాయల నాబార్డ్ నిధులతో నిర్మాణం చేస్తున్నా మిషన్ భగీరథ అంతర్గత త్రాగునీటి పైపు లైన్ నిర్మాణాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ , అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల పి.శ్రీజ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటిని అందించాలని వర్షాకాలం లో ఎక్కువగా త్రాగునీటి పైపు లైన్ లు లీకేజీ అవ్వడం వల్ల ప్రజలు కలుషిత నీరు త్రాగి అనారోగ్యం పాలు అతున్నారని ఇలాంటి ఘటనలు మన ప్రాంతం లో జరగకుండా అధికారులు అప్రమత్తమై పైపు లైన్ లికేజీలు ఉంటే వెనువెంటనే మరమత్తులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వెంకటా పురం గ్రామం లో నూతనంగా ఏర్పాటు చేసుకున్న గృహాలకు నల్ల కలెక్షన్ లేకపోవడం తో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే 49.53 లక్షల రూపాయల నిధులతో నూతన పైపు లైన్ నిర్మాణం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెంకటపూర్ గ్రామం లో నూతనంగా ఏర్పాటు చేసుకున్న గృహాలకు నల్ల నీటి సరఫరా అధించాలనే ఉద్దేశ్యం తో స్థానిక మంత్రి ప్రత్యేక చొరవతో నూతన పైపు లైన్ నిర్మాణం ఏర్పాటు చేయడం జరుగుతుందని దీని ద్వారా 12 వార్డ్ లలోని 450 గృహాలకు సురక్షిత మంచినీరు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ ఈ మల్లేష్ , డి ఈ అజహర్ సయ్యద్, మండల ఎంపీపీ బుర్ర రజిత, ఎంపీటీసీ లు జంగిలి శ్రీలత, పోషల అనిత , తహసిల్దార్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

# సమాజం నుండి సికిల్ సెల్ వ్యాధిని నిర్మూలిద్దాం

## గిరిజన ప్రాంతాలలో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయండి.




ఏటూరునాగారం (ములుగు)(గౌతమ్ న్యూస్ ): ములుగు జిల్లా స్టాపర్: సమాజం నుండి సికిల్ సెల్ వ్యాధిని నిర్మూలిద్దాం అని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా , స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. బుదవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం ను పురస్కరించుకొని భారత ప్రభుత్వము మరియు రాష్ట్ర ప్రభుత్వము సంయుక్తంగా ఏర్పరచుకున్న లక్ష్యము 2024 సంవత్సరానికి సమాజం నుండి సికిల్ సెల్ వ్యాధిని నిర్మూలించాడానికి అవగాహన కార్యక్రమము, సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షల కార్యక్రమమునకు రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ




మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్., అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి. శ్రీజ లతో కలిసి పాల్గోన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సికిల్ సెల్ వ్యాధి రాకుండా చూసుకోవాలని, రక్తమార్పిడి లాంటివి చాలా కష్టంగా ఉంటాయని, ఈ వ్యాధితో ఎవ్వరూ చనిపోకూడదని, వ్యాధి వచ్చిన వారికి, నిర్ధారణ జరిగిన వారికి, కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలని, గ్రామాలలో వైద్య సిబ్బంది డాక్టర్లు అవగాహన కార్యక్రమాలు, రోగనిర్ధారణ శిబిరాలు నిర్వహించాలని సూచించారు. రాబోవు వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక వైద్యశాలలో వైద్యులు అలర్ట్ గా ఉండాలని, ఎవరిని కూడా ఇతర జిల్లా ఆసుపత్రి కి రెఫర్ చేయకూడదని, ప్రతి ఒక్కరికి వైద్యము అందించాలని, వైద్యశాలలో డాక్టర్స్ లేరు అను వార్తలు రాకూడదని తెలిపారు. వైద్యులు సమయపాలన పాటించాలని, నాణ్యమైన వైద్య సేవలు గిరిజన ప్రజలకు అందించాలని, అంకిత భావంతో సేవలు అందించినట్లయితే గిరిజనులు వైద్య సిబ్బందిని తమ గుండెల్లో పెట్టుకుంటారని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, యుక్త వయసు అమ్మాయిలలో ఎక్కువగా సికిల్ సెల్ వ్యాధి వస్తుందని, జిల్లాలో 2300 మందికి పరీక్షలు నిర్వహించగా 20 మందికి వచ్చిందని సికిల్ సెల్ వ్యాధి మీద అందరికీ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, వ్యాధి రాకుండా నియంత్రించాలని, ఒకరి నుండి ఇంకొకరికి వ్యాపించకుండా కట్టడి చేయాలని తెలిపారు. సికిల్ సెల్ జన్యు పరంగా వస్తుందని, దాన్ని రాకుండా చూసుకోవాలని, నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని, ప్రజలను కోరారు. డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ, సికిల్ సెల్ వ్యాధి వంశపారంపర్యంగా వస్తుందని, తల్లిదండ్రులలో ఇద్దరికీ సికిల్ సెల్ వ్యాధి ఉన్నట్లయితే పిల్లలకు వస్తుందని, ఒకవేళ తల్లిదండ్రులలో ఒకరికి సికిల్ సెల్ వ్యాధి ఉండి ఇంకొకరికి లేనట్లయితే 25 శాతం వ్యాధి వస్తుందని, లేదా రాకపోవచ్చు అని, సికిల్ సెల్ ఎర్ర రక్తకణము కొడవలి రూపంలో ఉండి, రక్తహీనతకు దారితీస్తుందని, సికిల్ సెల్ వ్యాధి లక్షణాలు, రక్తహీనత,కీళ్ల నొప్పులు, కీళ్ల వాపులు, తరచుగా జ్వరం వస్తుందని, చాతినొప్పి అరుదుగా ఉంటుందని, ఆయాసం వస్తుందని తెలిపారు. చికిత్సలో భాగంగా హైడ్రాక్స్ యూరియా, రక్తమార్పిడి, మూలగ మార్పిడి, పోలిక్ యాసిడ్ మాత్రలు ఉంటాయని తెలిపారు. సికిల్ సెల్ జబ్బు ఉన్నవారు పెళ్లి చేసుకోకూడదని , ముందస్తుగా పరీక్షలు నిర్వహించుకోవాలని, దీనిపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు, ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ, ఈ సికిల్ సెల్ వ్యాధి రాకుండా జాగ్రత్త పడాలని,



ఇద్దరిలో సికిల్ సెల్ ఉన్నవారు పెళ్లి చేసుకోకూడదని, గిరిజనులలో ఎక్కువగా ఈ వ్యాధి వస్తుందని, పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని కోరారు. అనంతరము అక్కడ ఏర్పాటు చేసిన సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షల సెల్ లో మంత్రి రక్త పరీక్ష నమూనా ఇచ్చి వ్యాధి నిర్ధారణ పరీక్షల సెల్ పని తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్లాల్, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ పి రవీందర్, డెమో తిరుపతయ్య, మానిటరింగ్ సూపర్వైజర్స్ దుర్గారావు, సంపత్, భాస్కర్ ,సంపత్ రావు, రాయని గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనకు అవగాహనే ముఖ్యం



టేకులపల్లి (గౌతమ్ న్యూస్ ): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సులానగర్ లో వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ గారి ఆధ్వర్యంలో సికెల్ సెల్ ఎనీమియా దినం సందర్భంగా అవగాహన సమావేశం జరిగింది. బుధవారం నుండి జూలై మూడో తారీకు వరకు పాఠశాలల్లో, గురుకులాల్లో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరాల్లో, ఆరోగ్య ఉప కేంద్రాలలో, మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన మరియు స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతాయని వైద్యాధికారి తెలిపారు. జన్యుపరంగా సంభవించే ఈ రక్త సంబంధిత వ్యాధిని సమాజం నుండి నిర్మూలించడానికి ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మనిషి రక్తంలోని ఎర్ర రక్త కణాలు గుండ్రని ఆకారంలో ఉండి శరీరంలోని అన్ని భాగాలకు పోషకాహారం ఆక్సిజన్ నిరంతరాయంగా కొనసాగుతుందని కానీ సికిల్ సెల్ వ్యాధి ఉన్నవారి లో రక్తకణాలు కొడవలి ఆకారంలో ఉండి రక్తనాళాల గుండా రక్తం సాఫీగా ప్రవహించడానికి అవరోధం కలిగి ఉంటుందని ఇలాంటి వారిలో రక్తహీనత ఏర్పడి తరచూ రక్తం ఎక్కించాల్సి ఉంటుందని ఆరోగ్యవంతులలో రక్త కణం జీవితకాలం 120 రోజులు అయితే ఈ వ్యాధి ఉన్నవారిలో 20 నుండి 25 రోజులేనని కాబట్టి తీవ్రమైన రక్తహీనత, కామెర్లు, తీవ్రమైన ఇన్ఫెక్షన్లు కీళ్లు నడుము చాతి నొప్పి, కాళ్లు చేతుల వాపు, దృష్టి సమస్యలు, ఎదుగుదల సరిగా



ఉండకపోవడం, గర్భధారణ సమస్యలు,గుండెపోటు వంటివి ఉంటాయని ఈ వ్యాధికి సరైన మందులు లేవు కాబట్టి గర్భధారణకు ముందే భార్యాభర్తలు సికెల్ సెల్ నిర్ధారణ పరీక్షలు విధిగా చేయించుకొని ఈ వ్యాధిని తర్వాతి తరాలకు అందించకుండా ఉండడం ద్వారా మన సమాజం నుండి ఈ వ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చని దీనికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయని ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో సికిల్ సెల్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని కాబట్టి ప్రభుత్వం ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తుందని వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన టేకులపల్లి మండల అధ్యక్షురాలు శ్రీమతి మౌనిక మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరు ఈ వ్యాధిపై చర్చించి అవగాహన పెంచుకొని ఈ వ్యాధిని నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ పాల్గొనవలసిందిగా ఈ సందర్భంగా మండల ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాధి నిర్ధారణకు స్క్రీనింగ్ పరీక్షలు చేయడంతో పాటు ఇంతకుముందు చేసిన వారికి ఐడి కార్డులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యురాలు విజయ శ్రీ , హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, పబ్లిక్ హెల్త్ నర్స్ చంద్రకళ, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా సూపర్వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, నాగు బండి వెంకటేశ్వర్లు, వీసం శకుంతల, గుజ్జ విజయ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు




మల్లపూర్ **(గౌతమ్ న్యూస్ ):** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుప్రీంకోర్టు అడ్వకేట్ శ్రీ కొమిరెడ్డి కారమ్ చెందు గారి ఆదేశాల మేరకు శ్రీ రాహుల్ గాంధీ గారి జన్మదిన పురస్కరించుకొని మల్లాపూర్ మండల కేంద్రంలో కేక్ కట్ చేసి మిఠాయి పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రెటరీ బోయిని హన్మాండ్లు ఓబీసీ సెల్ మాజీ మండల అధ్యక్షుడు వంగ అశోక్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఉప అధ్యక్షులు తెలు నరేష్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ చిలివేరి శ్రీనివాస్ మాజీ ఎంపీటీసీ బిమన్న ప్రధాన కార్యదర్శి పుప్పాల వినోద్ సీనియర్ నాయకులు ఉడిగిరి నర్సయ్య గంగుల శ్రీనివాస్ ఎర్ర గంగరెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులు సంగ సందీప్ యాదవ్ వన్నెల అనిల్ సాయికిరణ్ హరీష్ పలుగొన్నారు

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్ఏకు వినతి

### ఎంఎల్ఏ తంగిరాల సౌమ్యను ఘనంగా సత్కరించిన జర్నలిస్టులు.



నందిగామ **(గౌతమ్ న్యూస్ ):** నందిగామ రెవెన్యూ డివిజన్ కేంద్రంగా నందిగామలో డివిజనల్



పి.ఆర్.ఓ(సమాచార శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి),నందిగామ ప్రాంతంలో అనేక సంవత్సరాలుగా జర్నలిస్టులుగా పని చేస్తున్న అర్హులైన వారందరికి ఉచితంగా 200గజాల ఇంటి స్థలం కేటాయించాలని వినతి, అర్హులైన జర్నలిస్టులందరికీ ఆక్రిడేషన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి,జర్నలిస్టులుగా పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డ్ లు ఇవ్వాలని,అంతే కాకుండా ప్రతి ఒక్క జర్నలిస్టుకు ప్రమాద భీమా వర్తించాలనే అనేక డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని నందిగామ ఎంఎల్ఏ తంగిరాల సౌమ్యకు జర్నలిస్టులు అందజేశారు.అనంతరం జర్నలిస్టులు ఎంఎల్ఏ సౌమ్యను శాలువా,పుష్పగుచ్చాలు,స్వీట్లు అందజేసి ఘనంగా సత్కరించారు..ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘ నాయకులు,పి.మీరాహుస్సేన్ ఖాన్,ఏచూరి శ్రీనివాసరావు,ఘంటా వీరభద్రరావు, కోట సుభాష్, పఠాన్ సైధాఖాన్,గుడిమెట్ల అనంత్,ముస్తాఫా,శింగంశెట్టి సత్యనారయణ,చలమల నాగేశ్వరరావు, నరసింహారావు,అనిల్ తదితరులు.

## రేగుంట ప్రీమియర్ లీగ్ సీజన్ -2 విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం




మెట్పల్లి**(గౌతమ్ న్యూస్ ):** రేగుంట ఆల్ యూత్ అసోసియేషన్ - స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేగుంట యువకులలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి గత 15 రోజులుగా నిర్వహిస్తున్న రేగుంట ప్రీమియర్ లీగ్ సీజన్ -2 క్రికెట్ పోటీలలో విజేతగా నిలిచిన సురకంటి శ్రీనివాస్ రైజర్స్ జట్టుకి విన్నర్ కప్ తో పాటు 20.000 వేల రూపాయల నగదు మరియు రన్నర్ టీం గా నిలిచిన రషీద్ ఎర్త్ మూవర్స్ జట్టు కి ట్రోఫీ తో పాటు 10.000 వేల రూపాయల నగదు ని అందించిన రేగుంట ఆల్ యూత్ అసోసియేషన్ - స్పోర్ట్స్ అధ్యక్షుడు గనవేణి మల్లేష్ యాదవ్ మొగిలిపేట విడిసి చైర్మన్ మహబూబ్, అందచేశారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసికంగా దృఢత్వానికి ఉపయోగ పడతాయని అన్నారు.. ఫ్రాంచైజీ ఓనర్స్ కుందేళ్ల రాజేష్, అరుణ హాస్పిటల్ డాక్టర్ వినోద్, నవీన్ స్టార్ట్ ఈఎన్టి హాస్పిటల్ రేగుంట ప్రీమియర్ లీగ్ కు సహకరించిన దాతలు దండ్ల శ్రీనివాస్,చిట్యాల నిఖిల్,ఎనగందుల సురేష్,కలకోట సతీష్, నల్ల శేషు, గనవేని మల్లేష్ యాదవ్,రాందాస్, భైర రాజు, బందెల నరేష్, బందెల తిరుపతి, రావులకరి నితిన్ బ్రదర్స్ స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు క్రీడాకారులు పాల్గొన్నారు...

## అపోహాలొద్దు కొత్తగూడెంలో పేదలకు గూడు కల్పించే భాధ్యత సిపిఐ దే

### దళారులు, పైరవీకారుల పట్ల లబ్ధిదారులు అప్రమత్తంగా ఉండాలి.

### డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలను సందర్శించిన సిపిఐ బృందం.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి **(గౌతమ్ న్యూస్ ):** కొత్తగూడెం : కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని పాతకొత్తగూడెంలో పేదలకు కేటాయించిన ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో అర్హతపొందిన లబ్ధిదారులు అపోహపడొద్దని, పెదలు, అర్హులైన లబ్ధిదారులకు పాత కొత్తగూడెంలో కేటాయించిన స్థలాల్లో స్వేచ్ఛగా ఇండ్ల నిర్మాణం చేపట్టుకోవచ్చని సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి, మున్సిపల్ కౌన్సిలర్ కంచర్ల జమలయ్య తెలిపారు. ఈ మేరకు పాతకొత్తగూడెంలోని పేదలకు కేటాయించిన ఇండ్ల స్థలాల ప్రాంతాన్ని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సిపిఐ నాయకులు, కౌన్సిలర్ల బృందం బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ కొందరు దళారులు, పైరవీకారులు లబ్ధిదారుల్లో అపోహలు సృష్టించి లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తున్నారని, వీరిపట్ల లబ్ధిదారులు అప్రమొత్తంగా ఉండాలని సూచించారు. పేదలకు కేటాయించిన ఇండ్ల స్థలాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారని, త్వరలో అందుకు సంబందించిన పనులు ప్రారంభం అవుతాయని అన్నారు, ఇండ్ల స్థలం మంజూరు కాబడిన లబ్ధిదారులకు ప్రత్యేక కోటా క్రింద ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేలా ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేందుకు ఎమ్మెల్యే కృషిచేస్తున్నారని, ఇప్పటికే సంబంధిత శాఖ అధికారులు, మంత్రి, ముఖ్యమంత్రితో సంప్రదించిపులు జరిపారని తెలిపారు. ప్రతినిధి బృందంలో కౌన్సిలర్లు భూక్య శ్రీనివాస్, మునిగడప పద్మ, ధర్మరాజు, బోయిన విజయ్ కుమార్, పి.సత్యనారాయణ చారి, నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు, యూసుఫ్, నేరెళ్ల శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, గొనె సురేష్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, రామారావు, గద్దం ప్రభాకర్, జలీల్, కొత్తూరు రవి, పలువురు లబ్ధిదారులు ఉన్నారు.

# యువత ఉద్యోగాలు సాధించి వారి తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించాలి

## అవరోధాలను అధిగమిస్తేనే విజయ తీరాలకు చేరుతారు.



ఏటూరునాగారం(ములుగు)**(గౌతమ్ న్యూస్ ):** ములుగు జిల్లా స్టాపర్: 52 ప్రైవేట్ కంపెనీలు , 2000 వేల ఖాళీల ఉద్యోగాలతో మెగా జాబ్ మేళా. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి జిల్లా కలెక్టర్. యువత ఉద్యోగాలు సాధించి వారి తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించాలని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా ఇంచేర్ల గ్రామం లోని యం.ఆర్ ఫంక్షన్ హాల్ లో 52 ప్రైవేట్ కంపెనీలు, 2000 ఖాళీల ఉద్యోగాలతో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా ను రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ శబరీష్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దనసరి



అనసూయ సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లాలో ఉండే స్థానిక యువత ఉద్యోగాలు సాధించి వారి తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించాలని దీనికి అనుగుణంగా 2000 వేల ఖాళీల ఉద్యోగాలతో, 52 ప్రైవేట్ కంపెనీలతో మెగా జాబ్ మేళా ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అనేక మంది యువత జాబ్ మేళాలకు హాజరై ఉద్యోగాలు సాధించిన అనంతరం పది రోజులు విధులు నిర్వర్తించి ఇబ్బందులుఎదురవుతున్నాయని కారణంతో వచ్చిన అవకాశాన్ని వదిలేస్తున్నారని కష్టాలను ఎదుర్కొని నిలబడుతేనే విజయం వరిస్తుందని అన్నారు. ఈ జాబ్ మేళ ద్వారా 7 వ తరగతి నుండి ఉన్నత చదువులు చదివిన యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని ఇలాంటి అవకాశాలు సద్వినియోగం చేసుకొని, గ్రామీణ స్థానిక యువతకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని యువతకు ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించడం కోసం ములుగు జిల్లాలో త్వరలోనే స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన ఉద్యోగ అవకాశాలుఅందిపుచ్చుకోవాలని , యువత కష్టపడితేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని , ఉద్యోగం సాధించడం ద్వారా కుటుంబంలో ఆర్థిక అభివృద్ధి వికసిస్తుందని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఏ ఇతర రంగాలలో ఉండే ఉద్యోగాలలో కూడా అనేక ఇబ్బందులు ఎదురవుతాయని వాటిని అడిగామిస్తూ ముందుకు వెళితేనే జీవితంలో విజయం సాధిస్తామని యువతకు తెలిపారు. ఈ సందర్భంగా జాబ్ మేళ లో 52 కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన 700 మంది యువతీ, యువకులకు నియామక పత్రాలు మంత్రి అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థ పి.శ్రీజ , డి ఆర్ డి ఓ శ్రీనివాస్ కుమార్, డీఎస్పీ రవీందర్ , వివిధ ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు, యువతి యువకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కూనంనేని భేటి

## కొత్తగూడెం నియోజకవర్గ సమస్యలపై సుదీర్ఘ చర్చ. మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్. అనతికాలంలోనే నియోజకవర్గ ప్రజలకు అందుతున్న కూనంనేని గెలుపు ఫలాలు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి**(గౌతమ్ న్యూస్ ):** కొత్తగూడెం : కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. రాష్ట్ర సచివాలయంలో గంటపాటు జరిగిన చర్చర్లలో కొత్తగూడెం నియోజకవర్గానికి సంబందించిన ప్రధాన సమస్యలను కూనంనేని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కూనంనేని ప్రతిపాదించిన పలు అంశాలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ స్పష్టమైన హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచను కలుపుతూ మున్సిపల్ కార్పొరేషనుగా ఏర్పాటు చేయాలనే కూనంనేని ప్రతిపాదనను ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేశారు. ఇందుకు సంబందించిన ప్రక్రియను త్వరలో చేపడతామని సీఎం తెలిపినట్లు కూనంనేని తెలిపారు. అదేవిధంగా కేటీపీఎస్ తొలిగంచబడిన ఏ బి సి విద్యుత్ స్టేషన్ల స్థలంలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు కూనంనేని తెలిపారు. జిల్లా రైతాంగ సాగునీరు అవసరాలు తీర్చేందుకు సీతారామ ప్రాజెక్టు డిజైన్ మార్చేందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేశారని, అదేవిధంగా పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రెవిన్యూ సమస్యలు పరిష్కరించే చర్యలు తీసుకుంటామని తెలిపారని, ప్రధానంగా పాల్వంచలోని 444, 817, 999, 727 తదితర సర్వే నంబర్లలో నెలకొన్న రెవిన్యూ సమస్యలకు శాశ్వత పరిస్కారం చూపుతానని సీఎం హామీ ఇచ్చారని, పాల్వంచ కొత్తగూడెం బైపాస్ రోడ్డు, నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేయిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కొత్తగూడెం జిల్లా ప్రధాన ఆస్పత్రికి రోగుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా మరో పది డయాలసిస్ యంత్రాల ఏర్పాటుకు అదేవిధంగా కొత్తగూడెం పట్టణ ఇండ్ల స్థలాల క్రమబద్దీకరణ జీవో 76ను పునరుద్ధరించి త్వరితగతిన యజమానులకు పట్టాలు జారీ అయ్యేవిదంగా ఆదేశాలు జారీ చేస్తానని సీఎం హామీ ఇచ్చారని కూనంనేని తెలిపారు. ఇప్పటికే వివిధ పథకాలక్రింద సుమారు రూ.12కోట్ల వ్యయంతో అంతర్గ రోడ్లు, డ్రైన్లు పూర్తి కావస్తుండగా ఇటీవలే పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదు యూనిట్లతో కూడిన డియలసీస్ కేంద్రాన్ని కూనంనేని సాధించారు. గెలిసిన ఆరునెల్లలోనే నియోజకవర్గ ప్రజలకు గెలుపు ఫలాలు అందుతుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన జితేష్ వి పటేల్ ఐఏఎస్ ను మర్యాదపూర్వకముగా కలిసిన


### సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలెం రాజు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి**(గౌతమ్ న్యూస్ ):** కొత్తగూడెం కలెక్టరేట్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన జితేష్ వి పటేల్, ఐఏఎస్ ని వారి కలెక్టరేట్ కార్యాలయం నందు సింగరేణి కొత్తగూడెం ఏరియా జిఎం ఎం. షాలెం రాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం తో సన్మానించారు. ఈ సందర్భముగా కొత్తగూడెం ఏరియా జిఎం కొత్తగూడెం ఏరియాలోని బొగ్గు ఉత్పత్తి, డిస్పాచ్, ఎన్విరాన్మెంట్ మరియు సేఫ్టీ గురించి వివరించి నూతన వి.కే.ఓసి ఉపరితల గని ప్రారంభం గురించి చర్చించడం జరిగింది.ఈ కార్యక్రమములో ప్రాజెక్ట్ ఆఫీసర్ జీకే ఓసి శ్రీ రమేష్, మధుకర్, సీనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్ తౌర్య నాయక్ పాల్గొన్నారు.

## జిల్లా అంగన్వాడీ కేంద్రాలకు పప్పు, నూనె ,పాలు ,గుడ్లు సకాలంలో అందజేయాలని

### జిల్లా కలెక్టర్ కు, జిల్లా సంక్షేమ అధికారికి వినతి పత్రం అందజేసిన ఏఐటీయూసీ జిల్లా నాయకత్వం.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి **(గౌతమ్ న్యూస్ ):** కొత్తగూడెం కలెక్టరేట్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అంగన్వాడి కేంద్రాలకు పప్పు నూనె ,పాలు .గుడ్లు ,సకాలంలో అందించాలి నూతన జిల్లా కలెక్టర్ కు సమస్య లతో కూడిన వినతిత్రాన్ని అందించిన ఏఐటీయూసీ జిల్లా నాయకులు బుదవారం సాయింత్రం కలెక్టర్ కార్యాలయం లో నూతన జిల్లా కలెక్టర్ జినీత్ వి పాటిల్ ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి అంగన్వాడీ కేంద్రాల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా కలెక్టర్ యూనియన్ నాయకుల తో మాట్లాడుతూ వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తమని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి వేల్పుల విజేత ను కలిసి వినతపత్రం అందచేశారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నారటి ప్రసాద్, జిల్లా కార్యదర్శులు వేర్పుల మల్లికార్జున్, కంచర్ల జమలయ్య ,జి. నగేష్ , అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గోనే మణి,ప్రమీల, కారం వసంత ,సరోజినీ ,రమాదేవి, రాజ్యలక్ష్మి, శ్రీదేవి, కమల దేవి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## వ్యవసాయానికి చేసిన అప్పు తీర్చే మార్గం లేక యువరైతు సూసైడ్.. ఎంత విషాదం..!




కురవి **(గౌతమ్ న్యూస్ ):** పంట దిగుబడి రాక, చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. బలపాల శివారు లింగ్యతండా లో జరిగింది అప్పుల బాధ తట్టుకోలేక ఓ యువ రైతు తనువు చాలించాడు. ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధర్మసోత్ దేవా (45)యువ రైతు. సొంత భూమితో పాటు గ్రామంలోనే రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు.కౌలుకు తీసుకున్న భూమిలో రెండు ఎకరాల్లో పత్తి, రెండు ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాడు. అయితే కాలం కలిసి రాక.. రెండు మూడేండ్ల నుంచి తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నాడు. చీడ పీడలు, అకాల వర్షాలకు పంట నష్టం జరిగింది. పంటను సాగు చేసేందుకు పెట్టుబడిగా రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. అయితే ఆ అప్పులు తీర్చే మార్గం అతడికి కనిపించలేదు. దీంతో మనస్థాపం చెంది తనువు చాలించాలని డిసైడ్ అయ్యాడు. మంగళవారం జూన్ 18 సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.గమనించిన కుటుంబసభ్యులు అంబులెన్స్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. 108 సిబ్బంది అతడిని బ్రతికించే ప్రయత్నం చేసినా.. ఫలితం లేకుండా పోయింది. సీపీఆర్ చేసినా ప్రాణాలు దక్కలేదు. అప్పటికే ధర్మసొత్తు దేవా మృతి చెందాడు. దీంతో బాధితుడి కుటుంబంతో పాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## నందిగామ పల్లగిరి గట్టుపై వేంచేసి ఉన్న శ్రీ మహాలక్ష్మి,శ్రీ కనకదుర్గమ్మ, శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవార్ల తొమ్మిదవ ప్రతిష్ట మహోత్సవములు



నందిగామ (గౌతమ్ న్యూస్ ): నేటి నుండి 22వ తేదీ శనివారం వరకు అత్యంత వైభవంగా జరుపబడునని ఆలయ అర్చకులు రాజేష్ శర్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమమాలలో శ్రీ రాజశ్యామల సహిత మహా రుద్ర యాగము తదితర భక్తి కార్యక్రమాలు నిర్వహించబడునని రాజేష్ శర్మ తెలిపారు.

# ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆ తర్వాత పార్టీలకు అతీతంగా కృషి చేస్తా



కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారిగా బుధవారం కరీంనగర్ కు బండి సంజయ్ వచ్చారు. సొంత గడ్డను చూసి పులకరించిపోయిన బండి సంజయ్ నేలతల్లిని ముద్దాడారు. అనంతరం కరీంనగర్ లోని మహాలక్ష్మి అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. ఆ తర్వాత అక్కడే మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల వరకే రాజకీయాలు ఉంటాయని ఆ తర్వాత పార్టీలకు అతీతంగా అందరూ ఎమ్మెల్యేలను, నాయకులు, కార్యకర్తలను కలుపుకుని అభివృద్ధి కోసం కృషి చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. తనకు వచ్చిన ఈ పదవి బాధ్యతలు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు పెట్టిన భిక్ష అని అన్నారు.కార్యకర్తల కష్టం, పార్టీ పెద్దల మద్దతుతో తాను నాయకుడిగా, కేంద్ర మంత్రిగా అయ్యానని తెలిపారు. రాజకీయంగా ఇంతటి వాడిని చేసిన తెలంగాణకు, కరీంనగర్ కు సెల్యూట్ చేస్తున్నానని అన్నారు.కార్పొరేటర్ స్థాయి నుంచి కేంద్ర మంత్రి స్థాయి వరకు ఎదిగానంటే ఇది కేవలం బీజేపీ లోనే సాధ్యం అవుతుందని అన్నారు.బీఆర్ఎస్ మూర?త్వ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తలు, నాయకులు తిన్న పోలీసుల లాఠీ దెబ్బలు, గృహనిర్భంధాలు, జైలు జీవితాల వల్లే తనకు కేంద్ర మంత్రి పదవి దక్కిందని బండి సంజయ్ అన్నారు.

# గ్రామాల్లో తాగునీటి వనరుల కల్పన కోసం డీపీఆర్ సిద్ధం చేయాలి..



కృష్ణా జిల్లాలో సాగునీటి కాల్వలు డ్రెయిన్లు నిర్వహణకు 55 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నంలో 17 కోట్ల రూపాయలతో 63 పనులకు ప్రతిపాదనలు సిద్ధం కాగా.. వర్షాకాలం వచ్చినా సాగునీటి కాల్వల నిర్వహణ చేపట్టకపోవడంపై మంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులను సాగునీటి కాల్వల్లో నీటి నిల్వలు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే, గ్రామాల్లో తాగునీటి వనరుల కల్పన కోసం డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ సీజన్ లో రైతులకు విత్తనాలు ఎరువులు కొరత లేకుండా ముందుగానే ఇండెంట్ పెట్టాలని మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాలు జారీ చేశారు. అలాగే, బందరు పోర్టు పనులపై కూడా గనులు, భూగర్భవనరులు,ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆరా తీశారు. రూ. 5, 156 కోట్ల రూపాయలతో నాలుగు బెర్తులతో 13 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో సామర్థ్యంతో 2025కి మొదటి దశ పనులు చేపట్టేలా పనులు చేస్తున్నట్టు మంత్రికి అధికారులు తెలిపారు. బందరు కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సరఫరా మెరుగు పరచటంపై దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి గట్టి దెబ్బ



హర్యానా, : హర్యానా అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. అలాంటి వేళ ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కిరణ్ చౌదరి, ఆమె కుమార్తె శృతి చౌదరి భారతీయ బుధవారం జనతా పార్టీలో చేరారు. న్యూఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టార్. హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైనీ సమక్షంలో వారిద్దరు బీజేపీ కండువా కప్పుకున్నారు. అనంతరం వారు విలేకర్ల సమావేశంలోమాట్లాడారు. బీజేపీ విధి విధానాలు రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు తీసుకు వెళ్తున్నాయని వారు పేర్కొన్నారు. ప్రధాని మోదీని వరుసగా ప్రజలు ఎన్నుకుంటున్నారని చెప్పారు. బీజేపీ.. ఎలా దినదినాభివృద్ధి చెందుతుందో చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏమి కావాలన్నారు. బీజేపీని తాము మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. హర్యానా కాంగ్రెస్ పార్టీలో చోటు చేసుకోన్న విపరీత ధోరణలను ఈ సందర్భంగా వారు సోదాహరణగా వివరించారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం.. హర్యానా వికాస్ పార్టీకి కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశామని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీ జెండాను వదిలి.. బీజేపీ జెండాను చేతిలోకి తీసుకోవాలంటూ ఈ సందర్భంగా తమ మద్దతుదారులకు వారు పిలుపునిచ్చారు. హర్యానాలో వరుసగా మూడోసారి బీజేపీ గెలిపించేందుకు సిద్ధం కావాలంటూ మద్దతుదారులకు కిరణ్ చౌదరి, శృతి చౌదరి సూచించారు. మరోవైపు కిరణ్ చౌదరి.. హర్యానా మాజీ సీఎం బన్సీలాల్ కోడలు. ప్రస్తుతం ఆమె బివానీ జిల్లాలోని తోషమ్ అసెంబ్లీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఇక హర్యానా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా శృతి చౌదరి ఉన్నారు. అయితే వీరిద్దరు మంగళవారం కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం విధితమే. ఈ మేరకు రాజీనామా లేఖను ఆ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేకు పంపారు.

## ప్రజా వేదిక నిర్మాణ ఖర్చెంతో తెలుసా ఏపీ సర్కార్ క్లారిటీ..!



ఏపీలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలో రుషికొండపై నిర్మించిన విలాసవంతమైన భవనాలపై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆ పార్టీ వ్యూహాత్మకంగా టీడీపీని టార్గెట్ చేసేందుకు ప్రజా వేదికను తెరపైకి తెచ్చింది. 2015-19 మధ్యలో చంద్రబాబు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల స్వీకరణ కోసం నిర్మించి, వాడిన ప్రజావేదిక కోసం పెట్టిన ఖర్చుతో పోలిస్తే రుషికొండ నిర్మాణాల కోసం తక్కువ ఖర్చే పెట్టామంటూ వైసీపీ కౌంటర్ ఇస్తోంది. దీనిపై ఇవాళ ఏపీ ప్రభుత్వం స్పందించింది. అమరావతిలో ప్రజా వేదిక నిర్మాణం కోసం అప్పట్లో టీడీపీ ప్రభుత్వం రూ.900 కోట్లు ఖర్చు చేసిందంటూ వైసీపీ ఛానల్ సాక్షిలో జరిగిన చర్చలో పేర్కొనడాన్ని తప్పుబడుతూ ఏపీ ప్రభుత్వం ఇవాళ ఫ్యాక్ట్ చెక్ విడుదల చేసింది. ఇందులో ప్రజా వేదికకు అయిన ఖర్చు రూ.900 కోట్లు కాదని, కేవలం రూ.90 లక్షలు మాత్రమేనని తేల్చి చెప్పేసింది. ఇందుకు సంబంధించి అప్పటలో ప్రభుత్వం విడుదల చేసిన జీవోను సైతం జత చేసింది. తద్వారా రూ.900 కోట్ల ప్రచారం ఒట్టిదేనని ప్రభుత్వం స్పష్టత ఇచ్చినట్లయింది. "ప్రజా వేదిక నిర్మాణానికి అయిన ఖర్చు కేవలం రూ.90 లక్షలు. 2017వ సంవత్సరం ఏప్రిల్ నాలుగున జారీ అయిన జీవో ప్రకారం ఆర్ అండ్ బీ డిపార్ట్మెంట్ నుంచి, ప్రజా వేదిక నిర్మాణానికి, రూ.90 లక్షల రూపాయల నిధులు జారీ అయ్యాయి. ఆ నిధులు కేవలం నిర్మాణానికి ఉపయోగించారు. ప్రజా వేదిక వద్ద పోలీస్ సెక్యూరిటీ అవుట్ పోస్టులు.. పార్కింగ్ స్థలం ఏర్పాటు.. వంటి వాటికి కలిపి.. కోటీ తొంబై లక్షలు ఖర్చు అయ్యాయి. ప్రజా వేదిక నిర్మాణానికి రూ.900 కోట్లు ఖర్చు అనేది పూర్తిగా అవాస్తవం" అని ఏపీ ప్రభుత్వం ఫ్యాక్ట్ చెక్ లో పేర్కొంది.

# రైలు ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి

- డార్జిలింగ్ జిల్లాలో ఘోర రైలు ప్రమాదంలో పలువురు సిబ్బంది, ప్రయాణికుల మరణం, గాయాల పాలవడం బాధాకరం.
- ఆగని రైల్వే ప్రమాదాలు - ప్రయాణికుల భద్రతకై నేర్వాల్సిన పాఠాలు.
- రైల్వేలో 3,15,780 సాంక్షన్డ్ ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయండి.
- బడ్జెట్ లో కోతలు, చార్జీల పెంపు, స్లీపర్ కోచ్ ల తగ్గింపు, రైళ్లలో రద్దీ, జాప్యం, రాయితీల ఎత్తివేత, శానిటేషన్, పార్కింగ్ దోపిడీ తదితర సమస్యలను పరిష్కరించండి.
- కాగ్, పార్లమెంటరీ ప్యానెల్, నిపుణుల సిఫార్సులను అమలు పరచాలి. భద్రతకు విఘాతం కలిగించే విధానాలను విడనాడాలి.

(గౌతమ్ న్యూస్ ): రైలు ప్రమాదాలపై సుప్రీంకోర్టు ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తో స్వతంత్ర విచారణ జరిపించాలి. జూన్ 2023లో అత్యంత ఘోరమైన కోరమండల్ ఎక్స్ ప్రెస్ రైలు ప్రమాదంలో 296 మంది మరణించి 1100 మందికి పైగా గాయపడిన ఘటన మరువక ముందే దేశవ్యాప్తంగా జరుగుతున్న పలు దుర్ఘటనలను ఉద్యోగుల, ఆఫీసర్ల, పెన్షనర్ల జాతీయ నేత వి. కృష్ణ మోహన్ ప్రధాన మంత్రికి తాజాగా వ్రాసిన లేఖలో పేర్కొంటూ భద్రతా లోపాలను ఎత్తి చూపారు. నిర్వహణా లోపాలు కారణంగా రైలు ప్రమాదాలు జరుగుతున్నాయని, ట్రాక్ లపై ఒత్తిడి పెరుగుతుందని, భద్రతా చర్యలు చేపట్టడం లేదని, ఒడిషా రైలు ప్రమాదం నుండి తేరుకోకముందే 40 ప్రమాదాలు జరిగాయని వివరించారు. కాంచన్‌జంగ ప్రమాదానికి కూడా సిగ్నల్ వ్యవస్థ పని చేయకపోవడం, కవచ్ రక్షణ వ్యవస్థ లేకపోవడమే ప్రధాన కారణాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆర్గనైజేషన్స్ కాన్ఫెడరేషన్ (సీసీజీజీఓఓ), దాని అనుబంధ గుర్తింపు పొందిన ఇండియన్ రైల్వే ప్రమోటీ ఆఫీసర్స్ ఫెడరేషన్ (ఐఆర్ పిఓఎఫ్) తదితరులు పలుమార్లు వివిధ అంశాలపై సమర్పించిన వినతి పత్రాలను, కాగ్ నివేదికలను జత చేశారు. రైల్వే భద్రతకు సంబంధించిన అన్ని అంశాలను పరిష్కరించాలని, వ్యవస్థాగత లోపాలను సరిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. ఇండియన్ రైల్వే మేనేజ్మెంట్ సర్వీస్ (ఐఆర్ఎమ్ఎస్) పేరిట ప్రవేశపెట్టిన స్కీం పట్ల పునరాలోచన చేయాలని కోరారు. 2011-12 లో అభివృద్ధి చేసిన ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ 'కవచ్' నెలకొల్పక పోవడం, సిగ్నలింగ్ టెలీ కమ్యూనికేషన్ కింద కేటాయించిన బడ్జెట్లో అత్యధికంగా ట్రాఫిక్ ఉన్న రైల్వే మార్గంలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్, సెంట్రలైజ్డ్ ట్రాఫిక్ కంట్రోల్ తదితరములకు ఒక్క పైసా కూడా ఖర్చు చేయక పోవడం, రైల్వే లైన్లు, సిగ్నల్ వ్యవస్థ, ట్రాకుల ఆధునీకరణ చేపట్టకపోవడం శోచనీయమన్నారు. రైల్వేలలో కనీస అవసరాలకు ప్రాధాన్యత నివ్వకుండా, సాధారణ ప్రయాణికుడిని విస్మరిస్తూ ఆదాయాన్ని గడిస్తున్న రైల్వే శాఖలో 3.11 లక్షల గ్రూప్ సి పోస్టులు, 3,018 గెజిటెడ్ క్యాడర్ సాంక్షన్ అయిన పోస్టులు ఖాళీగా వున్నా భర్తీకి నోచుకోకపోవడంతో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో మిగిలిన ఉద్యోగులపై తీవ్రమైన పనిభారం పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేసారు. దీంతో చాలా మంది మహిళా లోకో పైలట్లు, ఇతర సిబ్బంది రోజుకు 12 గంటలకు మించి సెలవు లేదా విశ్రాంతి లేకుండా నిద్రలేమి, బిజీ షెడ్యూల్స్ తో పని చేస్తున్నారని తెలిపారు. రైల్వేలో పని చేస్తున్న సుమారు 8 లక్షల మంది కాంట్రాక్ట్ కార్మికులు కనీస వేతనాలు, సురక్షిత పని పరిస్థితులు, చట్టబద్ద హక్కులు కోల్పోయారని, ప్రశ్నిస్తే సస్పెషన్లు, బదిలీలు, శిక్షలు వంటి సమస్యల మధ్య రైల్వే సిబ్బంది పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వాదనలు దాని స్వంత ఆడిటర్ అయిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికలో చెప్పిన దానికి విరుద్ధంగా ఉన్నాయి. రైలు భద్రతపై కాగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ట్రాక్‌ల పునరుద్ధరణకు నిధుల కేటాయింపు తగ్గిందనీ, కేటాయించిన నిధులను కూడా పూర్తిగా వినియోగించడం లేదని పేర్కొన్నది. 2017-2021 మధ్య జరిగిన రైల్వే ప్రమాదాలపై కాగ్ విశ్లేషణ ప్రకారం.. ఈ కాలంలో మొత్తం 2017 ప్రమాదాలు జరిగాయి. అందులో పట్టాలు తప్పినవి 1392 ప్రమాదాలు (69 శాతం). అంటే పట్టాలు తప్పి ఢీ కొనటం వంటి రైల్వే ప్రమాదాలే అధికంగా ఉండటం గమనార్హం. అయితే ఈ ప్రమాదాలకు కారణం 'మానవ తప్పిదం' అని నిందించటం ఏండ్లుగా ఒక సాధారణ ధోరణిగా మారిందనీ, అయితే కాగ్ నివేదిక ప్రభుత్వ వాదనలు తప్పని నిరూపిస్తున్నదని తెలిపారు. ట్రాక్ ల నిర్వహణ, బడ్జెట్ కేటాయింపులు, వ్యయం, పోస్టుల ఖాళీలపై కేంద్రానిది తీవ్ర నిర్లక్ష్యమని కాగ్ 2022 సెప్టెంబర్ నివేదికలో అక్షింతలు వేసినా, రైలు భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినా, లోపాలు ప్రస్తావించినా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. 2017-18లో ప్రవేశపెట్టిన రాష్ట్రీయ రైల్ సంరక్ష కోష్ (ఆర్ఆర్ఎస్కే) రైల్వే భద్రతా నిధి గురించి కాగ్ ఉటంకించింది. 1127 పట్టాలు తప్పగా 289 (26 శాతం) మాత్రమే పునరుద్ధరణ పనులకు నోచుకున్నాయని వివరించింది. ఆర్ఆర్ఎస్కే నుంచి ప్రాధాన్యత-1 పనులపై మొత్తం వ్యయం 2017-18లో 81.55 శాతం నుంచి 2019-20లో 73.76 శాతానికి తగ్గుదల ధోరణిని చూపించిందని పేర్కొన్నది. ట్రాక్ పునరుద్ధరణ పనులకు 2018-19లో నిధుల కేటాయింపు రూ.9607.65 కోట్ల నుంచి 2019-20లో రూ.7417 కోట్లకు తగ్గిందని కాగ్ వివరించింది. అత్యంత రద్దీగా ఉండే పశ్చిమ రైల్వే కోసం 2019-20లో మొత్తం వ్యయంలో ట్రాక్ పునరుద్ధరణ కోసం ఖర్చు చేసినది 3.01 శాతమే కావటం గమనార్హం. భద్రతకు సంబంధించిన పనులకు ఆర్థిక సాయం అందించటానికి ప్రత్యేక నిధిని సృష్టించే ఏకైక ఉద్దేశ్యం విజయం సాధించ లేకపోయిందని కాగ్ పేర్కొన్నది. పట్టాలు తప్పడానికి ప్రధాన కారణం ట్రాక్ నిర్వహణ అని వివరించింది. భారత రైల్వే లక్షలాది ఖాళీలతో, నామ మాత్రపు అవుట్‌సోర్సింగ్‌తో కార్యకలాపాలను నిర్వహించిందని కాగ్ వెల్లడించింది. ట్రాక్ ల సమర్థవంతమైన నిర్వహణ, సిగ్నలింగ్ వ్యవస్థ, రోలింగ్ స్టాక్ మొదలైన వాటితో పాటు తగిన సంఖ్యలో నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించడం మరియు అన్నింటికంటే ముఖ్యంగా రైల్వే ఆపరేషన్ యొక్క వివిధ విధుల మధ్య సమర్థవంతమైన సమన్వయంపై ఆధారపడి ఉంటాయి. వీటన్నింటినీ నిర్లక్ష్యం చేయబడ్డాయని తెలిపారు. 2017 లో సమర్పించిన భద్రతపై టాస్క్ ఫోర్స్ సిఫార్సులను, 2015 లో రైల్వే మంత్రిత్వ శాఖ 'శ్వేతపత్రం'ను అమలు చేయలేదు. పాత ట్రాక్ ను యుద్ధ ప్రాతిపదికన మార్చాల్సి ఉంటుందని, కానీ ఆర్థిక వనరులు లేమి సాకుతో చేయకపోవడంతో బ్యాక్ లాగ్ పెరుగుతూనే ఉన్నదని, అదే సాకుతో పాతబడి పోయిన సిగ్నల్ గేర్ ను కూడా మార్చటం లేదని అన్నారు. రైల్వేలు ప్రజల ఆస్తియని,మన ప్రజల సొమ్ముతో భారత కార్మికుల కష్టాలతో భారతీయ రైల్వేలు నిర్మించబడ్డాయని పేర్కొన్నారు. రైళ్ళు, రోడ్లు సామాన్య ప్రజలకు సరసమైన రవాణాను అందించడానికి ఉద్దేశించబడినవని, ఇవి ఏ ప్రభుత్వమైనా తన పౌరులకు సరసమైన ధరలకు భద్రతతో అందించాల్సిన సేవలని గుర్తు చేశారు. ప్రైవేటు కార్పొరేట్లకు లాభాలను ఆర్జించే మార్గాన్ని సృష్టించేందుకు భారతీయ రైల్వేలను ప్రైవేటీకరించవద్దని కోరారు. బృహత్తరమైన రైల్వే వ్యవస్థలో అంతా సవ్యంగా సాగడం లేదు. రైళ్ళు ప్రయాణించే ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థను నియంత్రించే ఇంటర్ లాకింగ్ వ్యవస్థలో పొరపాటు కారణంగా బాలాసోర్ ప్రమాదం జరిగిందని రైల్వేబోర్డు, రైల్వే మంత్రి పేర్కొన్నారు. 2017-21 మధ్య కాలంలో రైల్వేస్‌లో రైళ్ళు పట్టాలు తప్పిన ఘటనలపై కాగ్ ఇచ్చిన నివేదిక వ్యవస్థలో ఉన్న కొన్ని ప్రమాదకరమైన లోపాలను ప్రముఖంగా ఎత్తిచూపింది. రైల్వే ట్రాక్‌ల్లో నిర్మాణపరమైన లోపాలను, అలాగే పాయింట్లు, లైన్లు, కర్వ్‌లు వంటి అంశాలను తనిఖీ చేసి అంచనా వేసే ట్రాక్ రికార్డింగ్ కార్ల సోదాలు 30-100 శాతం తగ్గాయని ఆ నివేదిక పేర్కొంది. పట్టాలు తప్పిన 1129 ఘటనల్లో 422 ఘటనలు ఇంజనీరింగ్ సమస్యలు (ట్రాక్‌ల నిర్వహణ సరిగా లేక పోవడం (171 కేసులు), ట్రాక్ ప్రామాణికాలు పాటించకపోవడం (156 కేసులు) వల్లే జరిగాయని పేర్కొంది. బోగీల చక్రాల్లో లోపాల వల్ల జరిగిన ప్రమాదాలు 182 ఉండగా, పాయింట్లు సరిగా నిర్దేశించక పోవడం, ఇతర పొరపాట్ల కారణంగా 275 ప్రమాదాలు జరిగాయని నివేదిక పేర్కొంది. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్సీఆర్బీ) రికార్డుల ప్రకారం గడిచిన పదేళ్లలో జరిగిన రైలు ప్రమాదాల్లో 2.6 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 70 శాతం మంది 2017- 21 మధ్య కాలంలో మరణించారని పేర్కొన్నారు. ప్రారంభించిన రైలునే అట్టహాసంగా మళ్ళీ ప్రారంభించే బదులు సామాన్యులు ప్రయాణించే రైళ్ల బాగోగులు పట్టించుకోవాలని, కార్పొరేటీకరణ, ప్రయివేటీకరణే అన్నింటికీ పరిష్కారం అనే మానసిక స్థితి నుండి బయటపడి వాస్తవాలను ఆలోచించి ప్రజల భద్రతకు ఏం చేయాలో తెలుసుకుని ఇప్పటికైనా పూనుకోవాలని, దుఃఖితులకు ఓదార్పునివ్వాలని కోరారు. ప్రతి వందేభారత్ కోసం రైల్వే రూ. 115 కోట్లు పైగా వెచ్చిస్తున్నదని, 2027 తర్వాత ప్రారంభమయ్యే బుల్లెట్ ట్రైన్ వంటి అసాధారణ రేట్లుండే రైళ్ళతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఒరిగేదేముంటుందని ప్రశ్నించారు. గతంలో రైల్వే అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించే వారని, ఇప్పుడు ఆ పద్ధతీ నిర్వీర్యమైపోయిందని, వీటన్నింటి ఫలితంగా ప్రజల భద్రత మరింత ప్రమాదంలో పడిందని తెలిపారు. తమ వైఫల్యం, అసమర్థతలను, చేతగానితనాన్ని కప్పి పుచ్చుకునేందుకు, ప్రజల దృష్టి మళ్లించేందుకే ఘోర రైలు ప్రమాదాల్లో కుట్ర కోణాన్ని తెరపైకి తెచ్చారని, ఎక్కడ పెద్ద ప్రమాదం జరిగినా రైల్వే మంత్రిత్వ శాఖకు ఇది అలవాటేనని ఆయన పేర్కొన్నారు. ఐటీ సెల్ లోని పెయిడ్ ఆర్టిస్టులు దానికి అన్ని రకాల అబద్ధాలూ గుప్పించి, మతపరమైన మసాలా జోడించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని, దర్యాప్తు నివేదిక బయటకు వచ్చేసరికి ప్రజలు దాన్ని మర్చిపోతారని ఆయన పేర్కొన్నారు. 2023 మార్చిలో రైల్వే భద్రతపై పార్లమెంటరీ ప్యానెల్ సమర్పించిన నివేదికలో రైల్వే మంత్రిత్వ శాఖ అలసత్వాన్ని ఎత్తి చూపిందని, రైల్వే భద్రతకు సంబంధించిన నివేదికలు విస్మరించబడుతున్నాయని వివరించిందని తెలిపారు. కమిషన్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (సీఆర్ఎస్) చేసిన సిఫారసులు రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి అత్యంత ప్రాముఖ్యతను పొందవల్సి ఉన్నప్పటికీ అది వాస్తవానికి భిన్నంగా ఉన్నదనీ, తక్కువ శ్రద్ధను కలిగి ఉన్నదని పేర్కొన్నది. రైలు ప్రమాదాలు పునరావృతం కాకుండా ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా ఏటీఆర్‌లను సమర్పించడానికి కాలపరిమితిని నిర్ణయించాలని ప్యానెల్ ఆ నివేదికలో సిఫారసు చేసిందని గుర్తు చేశారు. రైల్వే ప్రయాణికుల భద్రతకు విఘాతం కలిగించే విధానాలను విడనాడాలని,కాగ్, పార్లమెంటరీ ప్యానెల్, నిపుణుల సిఫార్సులను అమలు పరచాలని వి. కృష్ణ మోహన్ ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేశారు.



వి. కృష్ణ మోహన్
జాతీయ చైర్మన్,
కేంద్ర ప్రభుత్వ గెజిటెడ్ ఆఫీసర్స్
ఆర్గనైజేషన్స్ కాన్ఫెడరేషన్ (సీసీజీజీఓఓ)
9182189533, 9440668281
కార్యదర్శి, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్
పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా)
kmdrdo@gmail.com

# సముద్ర మత్స్య ఉత్పత్తుల ఎగుమతుల్లో ఆల్ టైం రికార్డు

**రూ.60,524 కోట్ల విలువైన 17.82 లక్షల టన్నుల ఎగుమతి**
**వీటిలో రూ.40 వేలకోట్ల విలువైన రొయ్యలు, రూ.5,510 కోట్ల విలువైన చేపలు**
**ఎగుమతుల్లో అమెరికా, చైనా, జపాన్‌లకే ఎక్కువ**
**2023-24లో ఎగుమతుల వివరాలను ప్రకటించిన ఎంపెడా**



అమరావతి: సముద్ర మత్స్య ఉత్పత్తుల ఎగుమతులు 2023-24లో ఆల్ టైమ్ రికార్డు నమోదు చేశాయని సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (ఎంపెడా) చైర్మన్ డి.వి.స్వామి వెల్లడించారు. ఘనీభవించిన రొయ్యలు, చేపలు అమెరికా, చైనా దేశాలకు ఎక్కువగా ఎగుమతి అయ్యాయని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎగుమతుల వివరాలను ఆయన మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వివరించారు. 2022-23తో పోలిస్తే ఎగుమతి పరిమాణం 2.67 శాతం పెరిగింది. 2022-23లో రూ.63,969.14 కోట్ల (8,094.31 మిలియన్ డాలర్ల) విలువైన 17,35,286 టన్నుల సముద్రపు ఉత్పత్తుల ఆహారం ఎగుమతి కాగా, 2023-24లో రూ.60,523.89 కోట్ల (7.38 బిలియన్ డాలర్ల) విలువైన 17,81,602 టన్నుల సముద్ర ఉత్పత్తులు దేశం నుంచి ఎగుమతి అయ్యాయి. ఘనీభవించిన రొయ్యల పరిమాణం, విలువ రెండింటి పరంగా ప్రధాన ఎగుమతి ఉత్పత్తిగా నిలిచింది. గతేడాది తీవ్రమైన మార్కెట్ సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ 7.38 బిలియన డాలర్ల విలువైన 17,81,602 టన్నుల సముద్రపు ఆహారాన్ని రవాణా చేయడం ద్వారా ఆల్ టైమ్ గరిష్ట ఎగుమతులను నమోదు చేసినట్లు ఎంపెడా ప్రకటించింది. ప్రపంచస్థాయి వాణిజ్యరంగంలో భారతదేశ సముద్ర ఆహార దిగుమతుల్లో అమెరికా మొదటి స్థానంలో నిలిచింది. మత్స్య ఉత్పత్తుల ఎగుమతి ద్వారా 2,549.15 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని అమెరికా నుంచి భారత్ ఆర్జించింది. గతేడాదితో పోలిస్తే 34.53 శాతం వృద్ధిరేటు సాధించింది. ఆ తర్వాత మన మత్స్య ఉత్పత్తుల దిగుమతిలో చైనా రెండో అతిపెద్ద దేశంగా నిలిచింది. ఈ ఏడాది 1,384.89 మిలియన్ డాలర్ల విలువైన 4,51,363 టన్నుల మత్స్య ఉత్పత్తులు చైనాకు ఎగుమతి అయ్యాయి. 25.33 శాతం వృద్ధి రేటు నమోదైంది. చైనా తర్వాత స్థానాల్లో జపాన్, వియత్నాం, థాయలాండ్, కెనడా, స్పెయిన్, బెల్జియం దేశాలున్నాయి.

### రొయ్య ఎగుమతుల్లో అగ్రస్థానం అమెరికాకే

ఎగుమతుల్లో 7.16 లక్షల టన్నులతో ఘనీభవించిన రొయ్యలు మొదటిస్థానంలో నిలిచాయి. వీటిద్వారా దేశానికి రూ.40,013.54 కోట్ల ఆదాయం వచ్చింది. అత్యధికంగా 2,97,571 టన్నులు అమెరికాకు ఎగుమతి కాగా.. చైనాకు 1,48,483 టన్నులు, యూరోపియన్ దేశాలకు 89,697 టన్నులు, సౌత్ ఈస్ట్ ఏషియాకు 52,254 టన్నులు, జపాన్‌కు 35,906 టన్నులు, మిడిల్ ఈస్ట్ దేశాలకు 28,571 టన్నులు ఎగుమతి అయ్యాయి. ఆ తర్వాత ఘనీభవించిన చేపలు రెండో అతిపెద్ద ఎగుమతి ఉత్పత్తిగా గుర్తింపు పొందింది. వీటిద్వారా రూ. 5,509.69 కోట్ల ఆదాయం లభించింది. చేప, రొయ్యల ఆహారం, పొడి దాణా ఉత్పత్తులు ఎగుమతిలో మూడో అతిపెద్ద ఉత్పత్తిగా నిలిచింది. వీటి ద్వారా దేశానికి రూ.3,684.79 కోట్ల ఆదాయం వచ్చింది. ఘనీభవించిన స్క్విడ్ నాలుగో అతిపెద్ద ఎగుమతిగా నిలిచింది. దీనిద్వారా రూ.3,061.46 కోట్ల ఆదాయం లభించింది. సురిమి, సురిమి అనలాగ్స్‌కు చెందిన ఉత్పత్తులు ఐదోస్థానంలో నిలిచాయి. ఇవి రూ.2,414.43 కోట్ల విలువైన 1,35,327 టన్నులు ఎగుమతి అయ్యాయి. ఆ తర్వాత రూ.2,252.63 కోట్ల విలువైన 54,316 టన్నుల ఎగుమతితో ఫ్రోజెన్ కాటిల్ ఫిష్ ఆరోస్థానంలో నిలిచింది. చిల్డ్ ఐటమ్స్, ఆక్టోపస్ ఎగుమతులు ఏడు, ఎనిమిది స్థానాల్లో నిలిచాయి.

## భారత కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్..
# గంభీర్ కొత్త ప్రతిపాదన!



భారత క్రికెట్‌లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నట్లు తెలుస్తోంది. రేపటి లోపు టీమిండియా కొత్త కోచ్‌ను బీసీసీఐ ప్రకటించనుంది. రాహుల్ ద్రవిడ్ వారసుడిగా హెడ్ కోచ్ స్థానాన్ని గౌతమ్ గంభీర్ చేపట్టడం దాదాపు ఖాయమైంది. అయితే కోచ్ రేసులో గంభీర్‌తో పాటు డబ్ల్యూవీ రామన్ కూడా నిలిచాడు. వీరిద్దరిని బీసీసీఐ క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సీఏసీ) మంగళవారం తొలి రౌండ్ ఇంటర్వ్యూ చేసింది. మొదట గంభీర్‌కు తర్వాత రామన్‌కు సీఏసీ జూమ్ కాల్ ద్వారా ముఖాముఖీ నిర్వహించింది. వచ్చే మూడేళ్లలో భారత క్రికెట్ ప్రణాళికలను గంభీర్, భారత క్రికెట్ పురోగతి కోసం రోడ్ మ్యాప్‌ను రామన్ వివరించారు. అయితే రామన్ కంటే గంభీర్‌పైనే అడ్వైజరీ కమిటీ ఆసక్తిగా ఉందని సమాచారం. దీంతో గంభీర్ ఎంపిక లాంఛనమే అన్నట్టుగా తెలుస్తోంది. కాగా, టీ20 వరల్డ్ కప్ ముగిసిన అనంతరం గంభీర్ టీమిండియా కోచ్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. మెగాటోర్నీ తర్వాత భారత్ జింబాబ్వేతో టీ20 సిరీస్, శ్రీలంకతో వన్డే సిరీస్‌ను ఆడనుంది. అయితే ఈ సిరీస్‌లకు ప్రపంచకప్‌లో పాల్గొన్న ఆటగాళ్లకు విశ్రాంతి ఇవ్వనున్నారు. కాగా, గంభీర్ కోచ్ బాధ్యతలు అందుకున్న తర్వాత శ్రేయస్ అయ్యర్‌ను తిరిగి జట్టులోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేగాక శ్రీలంకతో వన్డే సిరీస్‌కు శ్రేయస్‌ను కెప్టెన్‌గా లేదా కనీసం వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేయాలని గంభీర్ ప్రతిపాదన చేయనున్నట్లు సమాచారం. సెంట్రల్ కాంట్రాక్టు లిస్ట్‌లో చోటు కోల్పోయిన అనంతరం శ్రేయస్ అయ్యర్ భారత జట్టులో చోటు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఐపీఎల్ ఆడిన శ్రేయస్ కోల్‌కతా నైట్ రైడర్స్‌ను విజేతగా నిలిపాడు. గంభీర్ మెంటార్‌గా, శ్రేయస్ కెప్టెన్‌గా కేకేఆర్ కాంబినేషన్ సూపర్ హిట్ అయ్యింది. ఐపీఎల్‌లో శ్రేయస్ కెప్టెన్సీని మెచ్చిన గంభీర్ భారత బ్యాకప్ కెప్టెన్‌గా ఈ మిడిలార్డర్ బ్యాటర్‌కు అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. సీనియర్ ప్లేయర్లు శ్రీలంకతో సిరీస్‌కు దూరంగా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో శ్రేయస్ వైస్ కెప్టెన్‌గా ఎంపికవ్వడం సులభమే అని క్రికెట్ వర్గాలు ఓ అంచనాకు వచ్చాయి.

## రోహిత్‌తో బంగ్లాదేశ్ క్రికెటర్ గొడవ.. ఐసీసీ జరిమానా



బంగ్లాదేశ్ యువ పేసర్ తన్జీమ్ హసన్ సకిబ్‌పై ఐసీసీ కొరడా ఝులిపించింది. నేపాల్ కెప్టెన్ రోహిత్ పౌడెల్‌తో గొడవకు దిగిన కారణంగా తన్జీమ్‌పై జరిమానా విధించింది. మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించినట్లు తెలిపింది. అంతేగాక ఓ డీమెరిట్ పాయింటుతో మందలించింది. గత 24 నెలలో తన్జీమ్‌కు ఇదే తొలి డీమెరిట్ పాయింట్. రెండేళ్ల కాలంలో ఓ ఆటగాడికి నాలుగు లేదా అంతకంటే ఎక్కువ డీమెరిట్ పాయింట్లు వస్తే అవి సస్పెన్షన్ పాయింట్లుగా కన్వర్ట్ అవుతాయి. రెండు సస్పెన్షన్ల పాయింట్లకు రెండు వన్డేలు, రెండు టీ20లు లేదా ఓ టెస్టు మ్యాచ్‌కు సదరు ప్లేయర్ నిషేధానికి గురవుతాడు. రోహిత్‌ను మైదానంలో ఢీకొని, ఆర్టికల్ 2.12 నిబంధనను ఉల్లఘించిన కారణంగా తన్జీమ్‌పై జరిమానా విధించినట్లు ఐసీసీ తెలిపింది. కింగ్స్ టౌన్ వేదికగా సోమవారం బంగ్లాదేశ్-నేపాల్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఓవర్ ముగిసిన అనంతరం నేపాల్ కెప్టెన్ రోహిత్ దగ్గరకు తన్జీమ్ వెళ్లి ఢీకొట్టడమే కాకుండా, కవ్వించే మాటలతో దురుసుగా ప్రవర్తించాడు. ఈ పోరులో బంగ్లా 21 పరుగుల తేడాతో నెగ్గి సూపర్-8కు అర్హత సాధించింది.తన్జీమ్ (4/7) నిప్పులు చెరిగే బంతులతో బంగ్లా విజయంలో కీలకపాత్ర పోషించాడు. రెండు ఓవర్లు మెయిడిన్ చేసి నాలుగు వికెట్లు పడగొట్టాడు. అతను సంధించిన బంతుల్లో ఏకంగా 21 బంతులకు పరుగులేమి రాకపోవడం గమనార్హం. మొదట బంగ్లాదేశ్ 19.3 ఓవర్లలో 106 పరుగులకు ఆలౌటైంది. షకిబ్ అల్ హసన్ (17బీ 22 బంతుల్లో, 2 ఫోర్లు) టాప్ స్కోరర్. సోంపాల్ (2/10), సందీప్ లమిచానె (2/17), రోహిత్ పాడెల్ (2/20), దీపేంద్ర సింగ్ (2/22) తలో రెండు వికెట్లతో సత్తాచాటారు. అనంతరం ఛేదనలో నేపాల్ 19.2 ఓవర్లలో 85 పరుగులకే ఆలౌటైంది. కుశాల్ మల్ల (27బీ 40 బంతుల్లో, 1 ఫోర్, 1 సిక్సర్), దీపేంద్ర సింగ్ (25బీ 31 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్సర్) పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించింది. తన్జీమ్ (4/7) నాలుగు వికెట్లు, ముస్తాఫిజుర్ రెహ్మాన్ (3/7) మూడు వికెట్లతో విజృంభించారు.

## హైదరాబాద్ ఆటగాళ్లకు జాక్‌పాట్.. టీమిండియాలో చోటు!



సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు నితీష్ రెడ్డి, అభిషేక్ శర్మకు జాక్‌పాట్ తగిలే అవకాశం ఉంది. ఐపీఎల్ 2024లో అద్భుత ప్రదర్శన చేసిన ఈ ఇద్దరు ఆటగాళ్లకు భారత జట్టులో చోటు దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి. జులైలో జింబాబ్వేతో జరిగే ఐదు టీ20ల సిరీస్ ద్వారా నితీష్, అభిషేక్‌లు అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసే ఛాన్సెస్ ఉన్నాయి. ఈ సిరీస్‌కు సీనియర్ ఆటగాళ్లు దూరం కానున్న నేపథ్యంలో బీసీసీఐ సెలెక్టర్లు అవకాశం కుర్రాళ్లకు ఇవ్వనున్నారు. ఐపీఎల్ 2024లో సత్తాచాటిన ఆటగాళ్లను జట్టులోకి ఎంపిక చేయాలని బీసీసీఐ నిర్ణయించినట్లు తెలుస్తోంది. నితీష్ రెడ్డి, అభిషేక్ శర్మ సహా ఐపీఎల్ 2024 లో మెరుగైన ప్రదర్శన చేసిన రియాన్ పరాగ్, మయాంక్ యాదవ్, హర్షిత్ రాణా, విజయ్‌కుమార్ వైశాఖ్, యశ దయాల్‌లకు సైతం భారత జట్టులో చోటు దక్కనుందని తెలుస్తోంది. వీరందరిని బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కు రావాలని బీసీసీఐ ఆదేశించినట్లు తెలుస్తోంది. సీనియర్ ప్లేయర్స్ శుభ్‌మన్ గిల్, సంజూ శాంసన్, యుజ్వేంద్ర చహల్, రింకూ సింగ్, ఆవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్‌లు కూడా జింబాబ్వే పర్యటనకు వెళ్లనున్నారట. ఐపీఎల్ 2024లో 13 మ్యాచ్‌లు ఆడిన నితీష్ రెడ్డి.. 33.67 సగటు, 142.92 స్ట్రైక్‌రేట్‌తో 303 పరుగులు చేశాడు. ఇందులో రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అజేయ హాఫ్ సెంచరీ (76 నాటౌట్)తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. బౌలింగ్‌లోనూ 3 వికెట్లు తీసాడు. మరోవైపు అభిషేక్ శర్మ 13 మ్యాచ్‌ల్లో 38.92 సగటు, 209.41 స్ట్రైక్ రేట్‌తో 467 పరుగులు చేశాడు. ఈ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు (41) కొట్టాడు.

## కేన్ విలియమ్సన్ సంచలన నిర్ణయం.. కెప్టెన్సీకి గుడ్ బై



న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. టీ20 వరల్డ్ కప్ లో పేలవ ప్రదర్శన దృష్ట్యా పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లోనూ కెప్టెన్సీ నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించారు. 2024-25 కాలానికి బోర్డు సెంట్రల్ కాంట్రాక్టును కూడా వదులుకున్నారు. కేన్ ఇప్పటికే టెస్టు కెప్టెన్సీకి దూరమైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది టీ20 వరల్డ్ కప్ లో లీగ్ దశలోనే న్యూజిలాండ్ వెనుదిరగడం గమనార్హం. ఆఫ్ఘనిస్తాన్, వెస్టిండీస్ చేతిలో ఓడిపోయిన న్యూజిలాండ్ గ్రూప్-స్టేజ్‌లోనే టీ20 ప్రపంచకప్ నుండి వైదొలగడం అందర్ని షాక్ కు గురి చేసింది.టీ20 ప్రపంచకప్ చరిత్రలో కివీస్ జట్టు గ్రూప్ దశ దాటి ముందుకు వెళ్లలేకపోవటం ఇదే తొలిసారి. అయితే విలియమ్సన్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అతని అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆటలో గెలుపు, ఓటములు సహజమేనని అంటున్నారు. విలియమ్సన్ 91 వన్డేలు, 75 టీ20 మ్యాచ్‌లకు కివీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ కాలంలో కివీ జట్టు 47 వన్డేలు, 39 టీ20 మ్యాచ్‌లు గెలిచింది.

# ఒలింపిక్స్ కు నీరజ్ చోప్రా శిక్షణ ఖర్చు 48 లక్షలు!



పారిస్ ఒలింపిక్స్ లో పాల్గొనే భారత అథ్లెట్ల శిక్షణ కోసం భారత క్రీడామంత్రిత్వశాఖ భారీమొత్తంలోనే ఖర్చు చేసింది. గత ఒలింపిక్స్ కంటే ఎక్కువ పతకాలు సాధించాలన్న లక్ష్యంతో శిక్షణ సదుపాయాలు కల్పించింది. పారిస్ వేదికగా మరికొద్దిరోజుల్లో ప్రారంభంకానున్న 2024 ఒలింపిక్స్ కు సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఒలింపిక్స్ బెర్త్ లు సాధించే భారత అథ్లెట్ల సంఖ్య పెరిగిపోతూ వస్తోంది. జులై 26 నుంచి ఆగస్టు 11 వరకూ జరిగే 33వ వేసవి ఒలింపిక్స్ లో 204 దేశాలకు చెందిన 10వేల మంది అథ్లెట్లు తలపడబోతున్నారు. భారత్ సైతం 130కి పైగా అథ్లెట్ల బృందంతో పాల్గొనుంది.

### 2020 టోక్యో ఒలింపిక్స్ లో....

టోక్యో వేదికగా ముగిసిన 32వ ఒలింపిక్స్ క్రీడల్లో భారత్ 124 మంది అథ్లెట్ల బృందంతో పాల్గొని ఓ స్వర్ణంతో సహా మొత్తం 7 పతకాలు సాధించింది. నీరజ్ చోప్రా స్వర్ణపతకంతో చరిత్ర సృష్టిస్తే..మరో రెండు రజత, నాలుగు కాంస్యపతకాలు భారత్ కు దక్కాయి. ఏడు పతకాలు సాధించినా పతకాల పట్టిక మొదటి 50 స్థానాలలో మాత్రమే భారత్ చోటు దక్కించుకోగలిగింది. అయితే..ప్రస్తుత పారిస్ ఒలింపిక్స్ లో మెరుగైన ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో భారత అథ్లెట్లను కేంద్ర క్రీడాప్రాధికార సంస్థ తీర్చి దిద్దుతోంది.

### 'టాప్స్ ' పథకం ద్వారా శిక్షణ..

ఒలింపిక్స్ లో పతకం సాధించే సత్తా కలిగిన అథ్లెట్లను ముందుగానే గుర్తించి..వారికి అత్యాధునిక శిక్షణ కల్పించడం కోసం భారత ప్రభుత్వం ఇప్పటి వరకూ 17 కోట్ల 90 లక్షల రూపాయలు ఖర్చు చేసింది. 'టాప్స్ ' ( టార్గెట్ ఒలింపిక్ పోడియం ) పథకం ద్వారా కోట్ల రూపాయలను అథ్లెట్లకు వివిధ రూపాలలో అందచేసింది. మిషన్ ఒలింపిక్ సెల్ అథ్లెట్ల శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తోంది. విదేశాలలో సైతం శిక్షణ పొందటానికి అథ్లెట్లకు అనుమతి ఇచ్చింది.

### ట్రాక్ అండ్ ఫీల్డ్ కోసం 6 కోట్ల 25 లక్షలు...

'టాప్స్ ' పథకం కింద ఎంపికైన ట్రాక్ అండ్ ఫీల్డ్ క్రీడాకారుల శిక్షణ కోసమే భారత ప్రభుత్వం 6 కోట్ల 25 లక్షల రూపాయలు ఖర్చు చేసింది. బ్యాడ్మింటన్ క్రీడాకారుల కోసం 5 కోట్ల 77 లక్షలు, షూటింగ్ క్రీడాకారుల కోసం 3 కోట్ల 83 లక్షలు, టెన్నిస్ ఆటగాళ్ల కోసం కోటీ 57 లక్షలు, పారా అథ్లెట్ల కోసం కోటీ 17 లక్షలు, కుస్తీ క్రీడాకారుల కోసం 55 లక్షలు, వెయిట్ లిఫ్టర్ల కోసం 43 లక్షలు, బాక్సర్ల కోసం 36 లక్షలు, విలువిద్య క్రీడాకారుల కోసం 20 లక్షలు, స్విమ్మర్ల కోసం 15 లక్షల రూపాయలు వెచ్చించింది.

### బంగారు పతకం కోసం భారీవ్యయం..

ఒలింపిక్స్ లో బంగారు పతకం సాధించడం అంటే అంత తేలికకాదు. క్రీడాకారుల స్వేదం, త్యాగానికి ప్రభుత్వం పెట్టే కోట్లాదిరూపాయల ఖర్చు తోడైతేనే ఆశించిన లక్ష్యం సాధించే అవకాశం ఉంటుంది. భారత్ కు కచ్చితంగా బంగారు పతకం సాధించే సత్తా కలిగిన జావలిన్ త్రో స్టార్ , గత ఒలింపిక్స్ లో స్వర్ణ విజేత నీరజ్ చోప్రా కోసం 'టాప్స్ ' పథకంలో భాగంగా 48 లక్షల 76వేల రూపాయలు ఖర్చు చేశారు. పారిస్ ఒలింపిక్స్ సన్నాహాలలో భాగంగా 176 రోజులపాటు విదేశీ ( దక్షిణాఫ్రికా, ఫిన్ లాండ్, జర్మనీ, టర్కీ)గడ్డ పైనే నీరజ్ శిక్షణ పొందాడు. 2023 డిసెంబర్ నుంచి 2024 మే వరకూ కేవలం నీరజ్ కోసమే భారత ప్రభుత్వం భారీగా ఖర్చు చేసింది.

### పీవీ సింధు శిక్షణ ఖర్చు 26 లక్షలు...

రియో ఒలింపిక్స్ రజత, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతకాల విజేత ,తెలుగుతేజం పీవీ సింధు శిక్షణ కోసం 26 లక్షల 60 వేల రూపాయలు వెచ్చించారు. 36 రోజులపాటు విదేశాలలో శిక్షణ పొందడం ద్వారా పారిస్ ఒలింపిక్స్ బ్యాడ్మింటన్ పతకానికి సింధు గురిపెట్టింది. టోక్యో ఒలింపిక్స్ మహిళల వెయిట్ లిఫ్టింగ్ రజత విజేత మీరా బాయి చాను విదేశీ శిక్షణ కోసం 42 లక్షల 54వేల రూపాయలు వ్యయం చేశారు. అమెరికాలోని సెయింట్ లూయిస్ కేంద్రంగా రెండు నెలలపాటు మీరాబాయి శిక్షణ తీసుకొంది.

### రోహన్ బొపన్న ఖర్చు కోటీ రూపాయలు...

టెన్నిస్ డబుల్స్ లో భారత వెటరన్ ఆటగాడు , 44 సంవత్సరాల రోహన్ బొపన్న శిక్షణ కోసం భారత క్రీడామంత్రిత్వశాఖ కోటీ 3 వేల రూపాయలు ఖర్చు చేసింది. విదేశీ శిక్షకులతో పాటు ఫిజియో సేవలను సైతం రోహన్ అందుకొన్నాడు. టేబుల్ టెన్నిస్ దిగ్గజం శరత్ కమల్ 6 లక్షల 20 వేల రూపాయలు, మహిళా వస్తాదు వినేశ్ పోగట్ 33 లక్షల 7 వేలు, అవినాశ్ సాబ్లే, పారుల్ చౌదరి, హర్మిలాన్ బెయిన్స్ కలసి కోటీ 79 లక్షల రూపాయలు, నిషాద్ కుమార్,మరియప్పన్ తంగవేలు 39 లక్షల 83 వేల రూపాయలు, మహిళా బాక్సర్ లవ్లీనా బోర్గెయిన్ 4 లక్షల 41వేలు, బ్యాడ్మింటన్ స్టార్ లక్ష్యసేన్ 9 లక్షల 33 వేల రూపాయల మేర 'టాప్స్ ' పథకం కింద లబ్ది పొందినవారిలో ఉన్నారు. అథ్లెట్ల శిక్షణ కోసం పెట్టిన కోట్ల రూపాయల ఖర్చుకు తగిన ఫలితం వస్తుందో...రాదో తెలుసుకోవాలంటే..ఆగస్టు వరకూ వేచిచూడక తప్పదు.

# నేటినుంచే సూపర్-8 షో..
# అఫ్ఘనిస్థాన్ తో భారత్ తొలిపోరు!

టీ-20 ప్రపంచకప్ సూపర్-8 సమరానికి ఈ రోజు ఆంటీగాలోని సర్ వివియన్ రిచర్డ్స్ స్టేడియంలో తెరలేవనుంది. తొలిపోరులో పవర్ ఫుల్ దక్షిణాఫ్రికాకు పసికూన అమెరికా సవాలు విసురుతోంది. వెస్టిండీస్, అమెరికా క్రికెట్ బోర్డుల సంయుక్త ఆతిథ్యంలో జరుగుతున్న 2024- ఐసీసీ టీ-20 ప్రపంచకప్ రెండోదశ సూపర్-8 పోరుకు కరీబియన్ గడ్డపై కౌంట్ డౌన్ ప్రారంభమయ్యింది. తొలిదశ 20 జట్ల గ్రూపు లీగ్ నుంచి 12 జట్లు నిష్క్రమించడంతో..ఆఖరి 8 జట్ల పోరుకు రంగం సిద్ధమయ్యింది. గ్రూపులీగ్ దశను విజయవంతంగా ముగించడం ద్వారా మాజీ చాంపియన్లు భారత్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్, డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ తోపాటు పసికూన అమెరికా, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్, దక్షిణాఫ్రికా సూపర్-8 రౌండ్ కు అర్హత సంపాదించాయి.

### ఆసియాజట్లకు మిశ్రమఫలితాలు....

భారత ఉపఖండం నుంచి ప్రపంచకప్ బరిలో నిలిచిన ఆసియాజట్లకు మిశ్రమఫలితాలు ఎదురయ్యాయి. మాజీ చాంపియన్లు పాకిస్థాన్, శ్రీలంక, ఒమన్ జట్లు గ్రూప్ లీగ్ దశ లోనే విఫలమైతే..భారత్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్ సూపర్-8 రౌండ్ చేరుకోగలిగాయి. ప్రపంచకప్ బరిలో తొలిసారిగా నిలిచిన పసికూన అమెరికా గ్రూపు- ఏ లీగ్ లో 5 పాయింట్లు సాధించడం ద్వారా సూపర్- 8 బెర్త్ సంపాదిస్తే..దిగ్గజజట్లు న్యూజిలాండ్, పాకిస్తాన్, శ్రీలంక అనూహ్యంగా ఇంటిదారి పట్టాయి. గ్రూప్- ఏ లీగ్ లో భారత్ 7 పాయింట్లతో టాపర్ గా నిలిచింది. అమెరికా 5 పాయింట్లతో రన్నరప్ కాగా..కెనడా 3 పాయింట్లు, ఐర్లాండ్ ఒక్కపాయింటుతో గ్రూపు 4, 5 స్థానాలలో నిలిచాయి. పాకిస్థాన్ కు 3 పాయింట్లు మాత్రమే దక్కాయి. గ్రూప్ -బీ లీగ్ నుంచి డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, నమీబియా, ఒమాన్, స్కాట్లాండ్ జట్లతో కూడిన పూల్- బీ మొదటి రెండుస్థానాలలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లు నిలిచాయి. ఆస్ట్రేలియా నాలుగుకు నాలుగు రౌండ్లూ నెగ్గడం ద్వారా 8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిస్తే..ఇంగ్లండ్ 5 పాయింట్లతో రెండోస్థానంలో నిలవడం ద్వారా సూపర్-8 రౌండ్ బెర్త్ సంపాదించాయి. ఇంగ్లండ్ తో సమానంగా స్కాట్లాండ్ సైతం 5 పాయింట్లు సాధించినా..నెట్ రన్ రేట్ ప్రకారం మూడోస్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. నమీబియా 2 పాయింట్లు, ఒమాన్ పాయింట్లేవీ లేకుండాను గ్రూపు ఆఖరి రెండుస్థానాలు దక్కించుకున్నాయి.



### గ్రూప్- సీ టాపర్ గా వెస్టిండీస్..

అఫ్ఘనిస్థాన్, వెస్టిండీస్, న్యూజిలాండ్, ఉగాండా, పాపువా న్యూగినియా జట్లతో కూడిన గ్రూప్- సీ లీగ్ లో రెండుసార్లు విజేత వెస్టిండీస్ 8 పాయింట్లతో టాపర్ గా నిలిచింది. ఆఖరి లీగ్ మ్యాచ్ లో చిత్తుగా ఓడినా ..అఫ్ఘనిస్థాన్ సూపర్ -8 రౌండ్ చేరుకోగలిగింది. న్యూజిలాండ్ 4 రౌండ్లలో 5 పాయింట్లు మాత్రమే సాధించి లీగ్ దశ నుంచే ఇంటిదారి పట్టింది. ఉగాండా నాలుగు, పాపువా న్యూగినియా ఐదు స్థానాలలో మిగిలాయి. పూల్- డీ లీగ్ నుంచి దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ సూపర్ - 8 రౌండ్ చేరుకోగా..శ్రీలంక, నెదర్లాండ్స్, నేపాల్ జట్ల పోరు తొలిదశకే పరిమితం అయ్యింది. ప్రపంచకప్ సూపర్-8 రౌండ్ తొలిపోరుగా ఈరోజు ఆంటీగా లోని సర్ వివియన్ రిచర్డ్స్ స్టేడియం వేదికగా జరిగే పోటీలో దక్షిణాఫ్రికాతో పసికూన అమెరికా తలపడనుంది.

### జూన్ 20న డబుల్ హెడర్...

సూపర్ -8 రెండోరోజు పోటీలలో భాగంగా రెండుమ్యాచ్ లు జరుగనున్నాయి. సెయింట్ లూకాలోని డారెన్ సామీ స్టేడియం వేదికగా జరిగే దిగ్గజాల సమరంలో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ తో రెండుసార్లు విజేత వెస్టిండీస్ పోటీపడుతుంది. బార్బడోస్ కెన్సింగ్టన్ ఓవల్ స్టేడియం వేదికగా జరిగే పోటీలో టాప్ ర్యాంకర్ భారత్ ను అఫ్ఘనిస్థాన్ ఢీకోనుంది. జూన్ 21న ఆంటీగా స్టేడియం వేదికగా జరిగే పోటీలో ఆస్ట్రేలియాతో బంగ్లాదేశ్ తలపడుతుంది. అదేరోజు సెయింట్ లూకా వేదికగా జరిగే మరో పోరులో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాజట్లు పోటీపడతాయి.

### ఆఖరిరోజున 3 రౌండ్ల మ్యాచ్ లు...

జూన్ 22న బార్బడోస్ వేదికగా జరిగే మ్యాచ్ లో వెస్టిండీస్ తో అమెరికా, ఆంటీగా వేదికగా బంగ్లాదేశ్ తో భారత్ తలపడతాయి. జూన్ 23న ఆస్ట్రేలియాతో అఫ్ఘనిస్థాన్, అమెరికాతో ఇంగ్లండ్ తలపడతాయి. సూపర్ -8 రౌండ్ ఆఖరిరోజు పోటీలలో భాగంగా మూడుమ్యాచ్ లు జరుగుతాయి.జూన్ 24న జరిగే కీలక పోటీలలో ఆస్ట్రేలియాతో భారత్, వెస్టిండీస్ తో దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ తో అఫ్ఘనిస్థాన్ ఢీ కొంటాయి. సూపర్ - 8 రౌండ్లో రెండు విజయాలు సాధించిన జట్లు సెమీస్ చేరుకొనే అవకాశం ఉంది. భారత్ తన మూడుమ్యాచ్ ల్లో బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్ జట్ల పైన నెగ్గినా సెమీస్ బెర్త్ ఖాయం చేసుకోగలుగుతుంది.

## ఐపీఎల్ స్టార్లకు జాక్ పాట్..
## జింబాబ్వే టూర్‌కు ఏడుగురు యువ ఆటగాళ్లు!



ఐపీఎల్ సీజన్ 2024 లో అదరగొట్టిన టీమిండియా యువ క్రికెటర్లకు సెలక్టర్లు జాతీయ జట్టులో స్థానం కల్పించనున్నారు. ఏకంగా 7 గురు ఆటగాళ్లు ఈ సిరీస్ లో ఎంట్రీ ఇవ్వనున్నారు. వరల్డ్ కప్ తర్వాత జింబాబ్వే టూర్ కు సీనియర్లు రెస్ట్ తీసుకోవంతో యువ క్రికెటర్లకు అవకాశం లభించనుంది. అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్, మయాంక్ యాదవ్, హర్షిత్ రాణా, నితీష్ రెడ్డి, విజయ్‌కుమార్ వైషాక్, యశ్ దయాల్ ఈ లిస్ట్ లో ఉన్నారు. వీరితో పాటు వెంకటేష్ అయ్యర్ జట్టులో చేరడం దాదాపుగా ఖాయమైంది. టీమిండియా ప్రస్తుతం టీ20 వరల్డ్ కప్ ఆడుతూ బిజీగా ఉంది. ఈ మెగా లీగ్ తర్వాత భారత క్రికెట్ జట్టు జింబాబ్వేలో అడుగుపెట్టనుంది. ఈ టూర్ లో భాగంగా భారత్ మొత్తం 5 టీ20 మ్యాచ్ లు ఆడుతుంది. జూలై 6 నుండి 14 వరకు ఈ సిరీస్ జరుగుతుంది. మొత్తం ఐదు టీ20లు హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జూలై 6,7,10,13,14 తేదీల్లో జరుగుతాయి. ఈ జట్టుకు సూర్యకుమార్ యాదవ్ లేదా రాహుల్ లో ఒకరు కెప్టెన్సీ చేసే అవకాశముంది. 8 ఏళ్ల తర్వాత జింబాబ్వేలో భారత్ పర్యటించడం ఇదే తొలిసారి. చివరి సారిగా 2016లో సిరీస్ ఆడగా భారత్ 2-0 తేడాతో సిరీస్ గెలిచింది. ఇప్పటివరకు మూడు సార్లు జింబాబ్వే పర్యటనకు వెళ్లిన మన క్రికెట్ జట్టు.. రెండు సార్లు సిరీస్ గెలిచింది. 2015 లో జరిగిన సిరీస్ 1-1 తో డ్రాగా ముగిసింది. ఇక్కడ మొత్తం 7 టీ20 మ్యాచ్ లాడగా.. 5 టీ20ల్లో విజయం సాధించింది. మరో రెండు టీ20 ల్లో ఓటమి పాలైంది.

## ప్రాక్టీస్‌లో బుమ్రా స్టన్నింగ్ క్యాచ్



టీ20 వరల్డ్ కప్ లీగ్ స్టేజ్‌లో సునాయసంగా విజయాలతో హోరెత్తించిన భారత్ కీలక సమరానికి సిద్ధమైంది. అఫ్గానిస్థాన్‌తో గురువారం బార్బడోస్ వేదికగా సూపర్-8లో తలపడనుంది. గ్రూప్-1లో భారత్, అఫ్గానిస్థాన్‌తో పాటు ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ ఉన్నాయి. కాగా, అఫ్గాన్‌తో మ్యాచ్ కోసం భారత ఆటగాళ్లు కఠోర సాధన చేస్తున్నారు. బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లో చెమటోడుస్తున్నారు. లీగ్ మ్యాచ్‌ల్లో పేలవ ప్రదర్శన చేసిన విరాట్ కోహ్లి మరోసారి నెట్స్‌లో తీవ్రంగా ప్రాక్టీస్ చేశాడు. స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌తో పాటు బ్యాకప్ పేసర్ ఖలీల్ అహ్మద్ బౌలింగ్‌లో సాధన చేశాడు. స్పిన్‌లో సమర్థవంతంగా కోహ్లి షాట్లు ఆడాడు. ఎక్కువ బంతులు బ్యాట్‌కు మిడిల్‌లో తాకాయి. అయితే ఖలీల్ బౌలింగ్‌లో విరాట్ కాస్త ఇబ్బంది ఎదుర్కొన్నాడు. ఈ ఎడమచేతి వాటం బౌలర్ సంధించిన బంతులను జాగ్రత్తగా ఎదుర్కొన్నాడు. కాగా, కీలక పోరులో ప్రతి క్యాచ్, ఒక్క పరుగు ఎంతో కీలకం. దీంతో భారత ఆటగాళ్లతో ఫీల్డింగ్ డ్రిల్స్‌ను కోచింగ్ స్టాఫ్ ఎక్కువసేపు చేపించింది. ఈ క్రమంలో స్టార్ ఫాస్ట్ బౌలర్ ఒంటిచేత్తో స్టన్నింగ్ క్యాచ్‌ను అందుకున్నాడు. గాల్లోకి ఎగురుతూ బంతిని ఒడిసిపట్టాడు. అనంతరం బుమ్రా ఫీల్డింగ్ నైపుణ్యాన్ని సహచర ఆటగాళ్లు హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్, చాహల్ అభినందించారు. హార్దిక్ ప్రత్యేకంగా బుమ్రాను హగ్ చేసుకుని కంగ్రాట్స్ చెప్పాడు. దీనికి సంబంధించిన వీడియోను ముంబై ఇండియన్స్ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. కాగా, బలబలాల పరంగా, గత రికార్డుల దృష్ట్యా అఫ్గానిస్థాన్ భారత్‌దే పైచేయి. ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో టీమిండియా ఏడు విజయాలు సాధించింది. ఓ మ్యాచ్ రద్దైంది. ఈ ఏడాది ఆరంభంలో ఆడిన టీ20 సిరీస్‌ను 3-0తో రోహిత్ సేన క్లీన్ స్వీప్ చేసింది. రేపటి మ్యాచ్‌లో భారత తుది జట్టులో మార్పులు జరిగే అవకాశం ఉంది. గేమ్ ఛేంజర్ కుల్‌దీప్ యాదవ్ తిరిగి తుది జట్టులోకి వచ్చే ఛాన్స్ ఉంది.ఈ వరల్డ్ కప్‌లో కుల్‌దీప్ బెంచ్‌కే పరిమితమైన విషయం తెలిసిందే.